


# నడిం ఏటిలో నావ

పెద్దకథ

-శమైత్రాగి

**ఆఫీసు** గడియారం అయిదు గంటలు కొట్టి చాలా సేపయింది. ఉద్యోగస్థులు ఒక్కొక్కరు తమ పనులు కట్టి పెట్టి లేచి ఒక్కసారి అలసట తీరా ఒళ్ళు విరుచుకుని, ఆఫీసు ఆవరణ దాటడం మొదలు పెట్టారు.

అరవిందకూడా తన సీటులోంచి లేచింది. అంత వరకూ ఏకాగ్రతతో కొట్టిన టైప్ కాగితాలను ఒజ్జి పెట్టి ప్యాడ్‌లో బిగించి, దాన్ని ఆఫీసు బీరువాలో భద్రం చేసింది. ఒక్కసారి చీర కుచ్చెళ్ళు సరి చేసుకుని, డెస్కు మీద పెట్టిన హాండ్‌బాగ్ తీసుకుంది చేతిలోకి.

అందుకోసమే చూస్తున్నాడా అన్నట్లు అంత వరకూ ఒక పక్కగా నిలుచుని ఉన్న ఓబయ్య ఆమె దగ్గరగా వచ్చి—"అయ్యగారు పిలుస్తున్నారమ్మా తమని" అన్నాడు వినయంగా.

'నన్నా! ఈ వేళప్పుడు పిలవడమా?' మనసులో తల ఎత్తిన భయ విస్మయాలను అణచుకుంటూ అతని వెంట ఆఫీసరు ఉన్న గదిలోకి వెళ్ళిం దామె అడుగులు తడబడుతూ ఉండగా.

'వచ్చావా! నీ కోసమే చూస్తున్నాను' అన్నట్లు

తల ఎత్తి చూసి, మందహాసం చేశాడు మోహన్‌రావు. పేరుకు తగినట్లుగానే అతను చాలా అందంగా ఉంటాడు. ఎంత ఉంటుందో వూహకు అందని వయ సాతనిది. ఎప్పుడూ నవ్వుతూ, కలకల్లాడు తున్న వదనంతో అందరితో మృదువుగా మాట్లాడు తూంటాడు.

అతను ఈ ఆఫీసుకు వచ్చి ఆరు నెలలే అయింది. అతని గురించి, అతని అలవాట్ల గురించి రకరకాలుగా చెప్పుకుంటారు ఉద్యోగస్థులు. మొదట్లో అతన్ని 'బెంగాలీబాబు' అని, 'కాదు, ఒరియా బ్రాహ్మణుడు' అని, 'కాదు, కన్నడమో, తమిళమో మాతృభాషగా కలవాడు' అని చెప్పుకునే వాళ్ళు. కాని, ఏ భాషలో అయినా అతను ధారాళంగా మాట్లాడ గలడు.

అంతకు ముందు ఉన్న ఆఫీసరు చాలా కర్కోటకుడని పేరు పొందాడు. అతన్ని మరొక చోటికి ట్రాన్స్‌ఫర్ చేయగా, ఆ స్థానం లోకి ఈయన వచ్చాడు.

"మన ఆఫీసరు గారింకా బాచిలరేను" అని ఒకళ్ళంటే, "అహా అదేమీ కాదు. ఆయన వెంట ఒక అందమైన ఆవిడను చూశాను. భార్య కానిదే అలా పబ్లిక్‌గా వెంట బెట్టుకు తిరుగుతారా ఎవరైనా" అంటారు మరొకరు. కాని, అతనికి పెళ్ళి అయినదీ, భార్యా పిల్లలు ఉన్నదీ, లేనిదీ ఎవరికీ సరిగ్గా తెలియదు.

ఆ ఆఫీసులో అరవింద కాక మరో నలుగురు ఆడవాళ్ళు ఉన్నారు. ఎవర్ని పలకరించినా గౌరవంగా, ఆదరంగా పలకరిస్తూంటాడు. అందుకే అతను వ్యక్తిగతంగా ఎటువంటి వాడైనా 'మంచివాడు' 'మంచి ఆఫీసరు' అనే పేరు తెచ్చుకున్నాడు.


అరవింద అతనికి నమస్కారం చెప్పుకుని, "పిలిచారా సార్?" అంది వినమ్రంగా.

"అవునమ్మా. నీకు అర్జెంటు పనులేమీ లేవు కదా ఇప్పుడు?" అడిగాడు మృదువుగా.

లేవన్నట్లు తల వూపింది.

"అయితే మా ఇంటికి రావాలి. ఈ రోజు మా హేమ బర్త్‌డే. నిన్ను తీసుకు రమ్మని మరీ మరీ చెప్పింది. తనకు పది మందినీ పిలవడం, ఆడంబరంగా పార్టీ చేసుకోవడం ఇష్టం ఉండదు. తనకు ఇష్టమైన ఒకరినో, ఇద్దరినో పిలుస్తుంది. నిన్ను ఆ మధ్య బజారులో చూసింది. నేనే చెప్పాను.—'మా ఆఫీసులో స్టెనో' అని. అప్పటినుంచి నిన్ను తీసుకు వచ్చి పరిచయం చేయమని'. పట్టినే పిలవడం ఎందుకు? ఏదైనా ఫంక్షన్ ఉన్నప్పుడు తీసుకు వెళ్ళవచ్చని నేనే ఇన్నాళ్ళూ నిన్ను పిలవలేదు. మరి, వస్తావా? నిన్ను తీసుకు వెళ్ళకుండా వెళ్ళితే తను చాలా ఫీలౌతుంది." ఏమంటావ్? అన్నట్లు చూశాడు.

ఆఫీసరు భార్యను చూడాలనే కుతూహలం మనసులో "వెళ్ళక వెళ్ళక వెళుతూ ఆమె పుట్టిన రోజు పండగకు ఏమీ తీసుకు వెళ్ళకుండా ఒట్టి చేతులతో వెళ్ళితే ఏం బాగుంటుంది? అనే సందేహం మరొక వైపు. 'తొలిసారిగా ఆమెతో పరిచయం చేసుకునే టప్పుడు కాస్త మంచి చీరన్నా కట్టుకోకుండా వెళ్ళితే ఎలా? ' అనే బాధ మనసులో. ఇని రకాలుగా ఆలోచిస్తూ ఎటూ చెప్పలేక నిలబడి పోయింది.




ఏం చెప్పితే ఈయన ఏం అనుకుంటాడో? 'ఆఫీసర్ని అభిమానంగా పిలిస్తే వచ్చింది కాదు' అనుకుంటాడేమో అనే భయం పీకుతున్నది.

"ఏమంటావమ్మా? నువ్వు వస్తున్నట్లు ఫోను చేయనా ఇంటికి? మా హేమ ఎదురు చూస్తూ ఉంటుంది." ఆఫీసరుగారు అన్ని సార్లు అడిగే సరికి ఇక రాను' అని మొరాయించ లేకపోయింది అరవింద. "వస్తాను, పదండి" అంది హాండ్‌బాగ్‌లో ఉన్న డబ్బును మనసులోనే అంచనా వేసుకుంటూ.

ఆఫీసరు ఫోను అందుకోగానే ఆయన భార్యతో మాట్లాడుతూంటే మనం ఎందుకు అక్కడ? అన్నట్లు ఆ గదిలోంచి ఇవతలికి వచ్చింది.

గది బయట నిలుచున్నా ఆఫీసరుగారు ఫోనులో నవ్వుతూ మాట్లాడడం వినిపిస్తూనే ఉంది.

'ఆమె వయస్సు ఎంత ఉంటుందో? బహుశా తన ఈడుదే కావచ్చు. లేదా ఇంకాస్త వయసు ఉంటుందేమో? వయసు ఎంత ఉన్నా పుట్టిన రోజు బహుమతిగా ఏమి ఇస్తే బాగుంటుందో? వస్తువా? పుస్తకమా? ఏది ఇస్తే సబబుగా ఉంటుందో? మనసులో తర్జన భర్జనలు.

"ఆడవారు వస్తువు లంటేనే ఎక్కువ మక్కువ పడతారు కనక ఏదైనా వస్తువు కొని ఇవ్వు" అంది అంతరాత్మ. ఆమె ఆలోచనలు ఒక కొలిక్కి రాకుండానే ఆఫీసరుగారు కారులో కూర్చుని అరవిందనుకూడా ఎక్కించుకుని ముందుకు సాగిపోయారు.

ఎన్నో దుకాణాలు, ఫాన్సీ షాపులు దాటిపోయాయి. తన వెంట ఆఫీసరుగారు ఉన్నారనే సిగ్గు, సంకోచాలతో ఎక్కడా ఆగమనలేక పోయింది. 'డబ్బు ఇచ్చి మీ ఇష్టమైన వస్తువు కొనుక్కోండి' అంటాను" అనే సమాధానంతో తృప్తి పడింది.

కారు వెళ్ళి చిన్న డాబా ఇంటి ముందు ఆగింది. హారన్ శబ్దానికి నడి వయసు దాటిన ఒకతను పరుగు పరుగున వచ్చాడు. అతనితో కన్నడంలో మాట్లాడుతూ ఆఫీసరు ముందు నడుస్తూంటే, సిగ్గు, బిడియాలతో వాళ్ళను అనుసరించి ఆ ఇంట్లోకి నడిచింది. హాలులో సంకోచిస్తూ నిలబడిపోయిన అరవింద, 'లోపలి నుంచి ఆఫీసరుగారి భార్య ఇంకా రాదేం?" అనుకుంటూ దిక్కులు చూడసాగింది. గది గుమ్మాలకు సిల్కు కర్టెన్లు వేలాడుతున్నాయి. హాలులో కార్నరు దగ్గర ఎత్తు బల్ల పెట్టి, దానిమీద ఫ్లవర్ వాజు పెట్టారు. దానిలో ఆకులు, మొగ్గలు, పూలు కలిసి ఉన్న పెద్ద గులాబి కొమ్మను పెట్టారు. గోడలమీద అందమైన హిందీ సినీతారల ఫోటోలు—రకరకాల భంగిమలతో ఉన్నవి—వేలాడుతున్నవి. ఆ బొమ్మలను బట్టి ఆఫీసరుగారు అందాన్ని ఆరాధించే వాడుగా గ్రహించింది. ఉన్నత పదవిలో ఉన్న అతని కీ చౌకబారు అభిరుచి ఏమిటో! అని లోలోపల ఏవగించుకుందికూడా.

మంచి కళాభిరుచి ఉన్న వారైతే ప్రకృతి దృశ్యాలతో ఉన్న పెయింటింగ్స్ కొని, నలుగురూ మసలే చోట అందరికీ కనుపించేలా తగిలిస్తారు. రాజకీయాలంటే అభిమానం కల వారైతే దేశ నాయకుల చిత్రాలను నాలుగు వైపులా వేలాడదీస్తారు. కాని, ఇలా సినిమా తారల ఫోటోలను ఆరాధించరు.

'ఈయన భార్యకూడా ఇటువంటి బాపతేకాబోలు!' ఆలోచిస్తూ పరధ్యానంలో పడిపోయిన అరవింద మోహన్‌రావు ఒకటికి రెండు సార్లు పలకరించినా వినలేదు. మూడవ సారి అతను నవ్వుతూ, 'మీకు పరధ్యానం ఎక్కువే అనుకుంటాను!" అన్నాడు.

ఆ మాటకు ఉలికి పడుతూ—"ఏమిటీ అంటున్నారు?" అంది.

"మిమ్మల్ని డిజప్పాయింట్ చేయవలసి వచ్చింది. మా హేమ బయటికి వెళ్ళిందట—'ఇప్పుడే వస్తాను' అని. మీరువస్తే మిమ్మల్ని కూర్చోబెట్టి కాఫీ, టిఫిన్ ఇమ్మందట. ఆ విషయమే చెబుతున్నాడు నాతో. అతనికి కన్నడం తప్పించి మరొక భాష తెలియదు. అతని గురించి మేమే ఆ భాష నేర్చుకో వలసి వచ్చింది. కూర్చోండి. అలా ఎంత సేపు నిలుచుంటారు? నేను డ్రెస్ ఛేంజి చేసుకునీ వస్తాను" అంటూ అతను లోపలికి వెళ్ళిపోయాడు.

వార్తలకు, వ్యాఖ్యలకు, స్వతంత్ర భావ ప్రకటనకు
అందరూ అభిమానించే దినపత్రిక
ఆంధ్రప్రభ

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్ ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్ ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు______
విలాసము______
______PIN______




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్ —

క్లాసులు ప్రారంభమయినవి
1981 ఫిబ్రవరి 21, 22 తేదీలలో 6వ తరగతిలోనికి
ప్రవేశ పరీక్షలు జరుగును.
సైనిక స్కూలు : కోరుకొండ (ఏ. పి.)
* బాలుర వయస్సు 1981 జూలై 1 వ తేదీ నాటికి 10—12 సం. మధ్య నుండవలెను. డిఫెన్సులోని, ఎక్సుసర్వీసు ఉద్యోగుల, సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులముల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు.
* కోరుకొండ సైనిక స్కూలుతో సమానముగా ప్రారంభించి, చక్కటి హాస్టలు వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నిక గన్న దక్షిణ భారత దేశము నందలి ప్రప్రథమ విద్యా సంస్థ.

ఫోన్ : 22084



శ్రీ విద్యా విహార్
"ఆదర్శ గురుకుల విద్యాసంస్థ"
లలితానంద నగర్, రింగ్ రోడ్.
గుంటూరు-6.
నర్సరీ నుండి మెట్రిక్ వరకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో క్లాసులు కలవు.
SAVITA

'ఈయన భార్య ఎటువంటిదో? తను లేకుండా నే నిక్కడ ఉంటే అపార్థం చేసుకుంటుందేమో? అసలు నేను రాకుండా ఉండివలసింది.' పరిపరి విధాల పోతున్నది అరవింద మనసు. తెగించి వెళ్ళి పోలేదు. అలా అని అక్కడ కూర్చొనే బుద్ధి కావడం లేదు.

నౌకరు డైనింగ్ టేబిల్ మీద అన్నీ అమర్చి అరవిందతో ఏదో చెప్పాడు. కాని, తనకు కన్నడం తెలిస్తే కదా బదులు చెప్పడానికి? తెల్లముఖం వేసుకుని వెర్రిదానిలా చూడసాగింది. అతను తన కడుపు చూపెట్టి మళ్ళీ ఏదో చెప్పాడు.

వాడి గోల అర్థంకాక కోపాన్ని, ఉక్రోషాన్ని దిగమింగుతూ తల కొట్టుకుంది నిస్సహాయంగా.

వాడు సణుగుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. ఇప్పుడు అంత పెద్ద ఇంటిలో, ముఖ్యంగా ఆ గదిలో తను ఒక్కర్తే బిక్కు బిక్కు మంటూ కూర్చుండి పోయింది.

నిమిషాలు భారంగా దొర్లుతున్నాయి. గొప్పవారి ఇళ్ళలో జరుపుకునే బర్త్ డే పార్టీలు ఇలాగే ఉంటాయి కాబోలు! ముఖమన్నా చూడని ఆఫీసరు భార్య మీద చాలా కోపమే వచ్చింది అరవిందకు. కాని, ఏం చేస్తుంది? తన కోపమే తన శత్రువు అనే సామెతను మననం చేసుకుంది. బుద్ధిమంతురాలులా కూర్చుంది.

ఆఫీసరుగారు వచ్చిన సూచనగా లవెండర్ స్మెల్ ఆ గదిలో వ్యాపించి, ఆమెను ఒక క్షణం ఉక్కిరి బిక్కిరి చేసింది.

ఆ వెనకాలే ట్రిమ్ గా తయారైన ఆఫీసరు గదిలోకి వచ్చాడు.

"మా నౌకరు ఏడీ?" అడిగాడు నవ్వుతూ.

"అతను కడుపు మీద చెయ్యి వేసుకుని ఏదో చెప్పాడు. నాకు అర్థం కాలేదు. గొణుక్కుంటూ బయటికి వెళ్ళిపోయాడు." చెప్పిం దామె.

"అయ్యో! అలాగా? వాడికి కడుపు నొప్పి మళ్ళీ వచ్చిందన్న మాట. జింజరు తాగి రావడానికి వెళ్ళాడు కాబోలు!"

ఆమాత్రం గ్రహించలేని తన మట్టి బుర్రను తిట్టుకుంటూ సిగ్గుగా తల వాల్చేసుకుంది అరవింద. అతను కుర్చీలో కూర్చుంటూ, "నా భార్యకోసం చూస్తూ కూర్చున్నా వంటే ఈ రోజుకు తిరిగి మా ఇంటికి వెళ్ళినట్లే. ముందు వాటిని తిను. గెస్టులను ఇంటికి రప్పించి తను వెళ్ళి సినిమా హాలులో కూర్చుంటుంది. ఇంటికి వచ్చి సంగతి తెలిసి, 'వాళ్ళు వస్తున్న సంగతే గుర్తులేదు సుమండీ!' అని నొచ్చుకుంటుంది. అంతే." తన భార్య అలవాట్లు తనకు ఎలా అలవాటో చెప్తూ సోడాలో విస్కీ కలుపుకుని తాగి, వేయించిన జీడిపప్పు, ఇంకా ఇతర ఫలహారాలు భోజనం చేస్తున్నాడు. అతను అలా తాగుతూంటే అరవిందకు కడుపులో చేయి పెట్టి కలిపినట్లు వికారం పుట్టసాగింది. అతి కష్టంగా ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుంది.

ఆఫీసరు మాటలు ముద్దగా వస్తున్నవి. సగం తెలుగు, సగం ఇంగ్లీషు మాట్లాడుతున్నాడు. "నువ్వు చాలా అందంగా ఉన్నావు" అంటున్నాడు. "నీలాంటి అమ్మాయితో స్నేహం ఒక్క రోజైనా చాలు, బ్రతుకు ధన్యం అయిపోతుంది" అంటున్నాడు,

వెకిలిగా నవ్వుతూ. అతని కళ్ళు కైపుతో ఎర్రగా భయంకరంగా ఉన్నాయి. అతను కాంక్షతో, విస్మయంతో చంగా చూస్తున్నాడు అరవిందను.

అరవిందకైతే భయంగా, కంపరంగా ఉంది, అతని ధోరణి చూస్తూంటే. అతని మాటలను నమ్మి వచ్చినందుకు లోలోపల చింతించసాగింది. కొంపతీసి ఇతను తనను బలాత్కారం చేస్తే? తను తప్పించుకోగలదా? 'భగవాన్? నన్ను ఎట్టి స్థితిలోకి తీసుకువచ్చావు?' భయంగా, జాలిగా అతని వైపు గుమ్మం వైపు చూడసాగింది. బయటికి వెళ్ళిన నౌకరుకాని, భార్యకాని ఈ క్షణంలో రాకపోతారా తనను ఈ ఆపదనుంచి కాపాడక పోతారా అనే ఆశ మనసులో. కాని, నిజానికి అరవిందకు ఏమీ తెలియదు. కడుపు నొప్పి అనే వంకతో బయటికి జారుకున్న నౌకరు ఇప్పుడిప్పుడే రాడని, అసలు పెళ్ళేకాని అతనికి భార్య ఉన్నమాట అభూత కల్పన అని, అందుకే ఒకపక్క భయంగా ఉన్నా, మరో వైపు ఇద్దరిలో ఎవరో ఒకరు వచ్చి తనని రక్షించక పోతారా అనే ఆశ మనసులో.

అతను లేచాడు. తూలుకుంటూ అరవింద దగ్గరికి వచ్చి, "కమాన్ మై బేబీ!" అన్నాడు, ఆమె భుజం మీద చేయి వేసి. అరవింద ఆడ పులిలా విదిలిస్తూ లేచి నిలబడింది. అసహ్యంగా చూసింది—'నువ్వొక మనిషివేనా? దొంగ మాటలతో నాలాంటి ఆడపిల్లలను మోసం చేస్తావా?' అన్నట్లు.

"నీకు ప్రమోషన్ అక్కర్లేదా? ఈ ఒక్క రోజూ నా కోరిక తీర్చావంటే నీకు ప్రమోషన్ ఆర్డరు రేపే వస్తుంది."

"నీ కోరిక తీర్చకపోతే?"

"అసలు ఉద్యోగమే ఊడిపోతుంది." అతను హేళనగా నవ్వాడు.

'నీ అందమైన రూపం వెనకాల ఎంత కుళ్ళు బుద్ధి ఉందో!' అనుకున్న అరవిందే— "అక్కర్లేదు. నేనే ఉద్యోగం విడిచిపెట్టేస్తున్నా" అంది దృఢమైన గొంతుతో.

"నువ్వు నా చేతిలోంచి తప్పించుకుని బయట పడినప్పుడు కదా నీ జాబ్ గురించి ఆలోచించేది!" అతను పక పక నవ్వాడు.

ఆ నవ్వు రాక్షసుడి నవ్వులా అతి భయంకరంగా వినిపించి అతని వైపు చూడలేనట్లు క్షణం కళ్ళు మూసుకుం దామె.

అతను ఆమె దగ్గరగా వచ్చి భుజంమీద చేయి వేశాడు. "కోపంలోకూడా చాలా అందంగా, ముద్దుగా ఉన్నావు సుమా! ఒక్కసారి, ప్లీజ్! ఒక్కసారి నా కౌగిలిలో ఒదిగిపో. అందుకు ప్రతిఫలంగా ఏమి ఇవ్వమన్నా ఇస్తాను. బట్టలు కావాలా? నగలు కొనిపెట్టనా? పోనీ, డబ్బయినా సరే." ఆమెను తన వైపు లాక్కుంటూ అన్నాడు.

"ఛీ! దుర్మార్గుడా! వదులు. నన్ను వదలకపోతే నీ రక్తం కళ్ళ చూస్తాను." ఆడ పులిలా ఛీత్కారం చేసింది అరవింద.

అయినా అతను ఆమెను బలాత్కారం చేయడం మానలేదు. అరవింద అతని చేతిమీద గాట్లు పడేలా కొరికింది. బాధతో చేతిని వెనక్కి లాక్కున్నాడు. ఇదేఅదనని అతని పట్టులోంచి తప్పించుకుని దూరంగా



## అంకితం

రచయిత తను రాసిన నవలను భార్యకు అంకితం చేస్తూ ఇలా రాసుకున్నాడు:

"నా శ్రీమతికి:

నాతో దెబ్బలాడి, అలిగి పుట్టింటికి వెళ్ళక పోతే నే నీ నవల రాయగలిగే వాణ్ణి కాను-అందుకు కృతజ్ఞతగా. . ."

పరుగెత్తింది. కాని, అతను విడిచిపెట్టలేదు. వెనకగా వచ్చి పమిట పట్టుకుని లాగాడు. ఇక తను సర్వనాశనం కాక తప్ప దనుకుంది అరవింద. ఆమెలో పిచ్చి ఆవేశం పొంగింది. బల్లమీద గుండు రాయి లాంటి వస్తువేదో చేతికి దొరికితే దానితో శక్తికొలదీ అతని నెత్తిమీద ఒక్కటి వేసింది.

అంతే. అతను ఆర్తనాదం చేస్తూ వెనక్కి విరుచుకు పడిపోయాడు. అరవింద 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ ఆ గదిలోంచి హాలులోకి పరుగెత్తింది. ఆ తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. అవి కూడా తీసుకుంది. బయట కాలు పెట్టబోతూంటే మనసు లోతుల్లోంచి ఏదో అదృశ్యవాణి 'పాపం! అతను చచ్చిపోయాడేమో? ఆ విషయం గమనించావా?" అనే హెచ్చరింపుతో ఆమెలో మరుగున పడి ఉన్న మానవత్వాన్ని తట్టి లేపినట్లయింది. అంతే! ఆమె ఆగింది. అడుగులో అడుగు వేస్తూ ఆఫీసరు పడి ఉన్న గదిలోకి వచ్చింది. క్రింద నేలమీద స్పృహలేని స్థితిలో పడి ఉన్నాడు ఆఫీసరు. అతని తలనుంచి కారిన రక్తంతో తల దగ్గర నెత్తురు మడుగులా ఉంది. అంత రక్తం చూసేసరికి అరవింద కళ్ళు ఒక క్షణం చీకట్లు కమ్మినట్లయింది. కోపం, ఆవేశం తగ్గి ఆ స్థానంలో భయం, సానుభూతి చోటు చేసుకున్నాయి. కొంపతీసి అతను చచ్చిపోలేదు కదా!

అతను చచ్చిపోతే పోలీసులు తనను పట్టుకుని జైలులో పారేయడంభాయం.అప్పుడు...అప్పుడుతనకు హంతకి అనే పేరు ముద్ర పడిపోతుంది. ఉద్యోగం ఊడిపోతుంది. అయినవాళ్ళు, కానివాళ్ళు తనను హంతకురాలులా చూస్తారు. అవమానిస్తారు. భగవాన్! ఎంత పని చేశావు! అరవిందకు గుండెలోంచి దడ వస్తున్నది. ఏమి చేయడానికీ తోచడం లేదు. అతనికి దగ్గరగా వెళ్ళి ముక్కు దగ్గర చేయిపెట్టి చూసింది. కొద్దిగా ఊపిరి ఆడుతున్నట్లుగా ఉంది. నిజంగా అది ఊపిరో లేక, తన భ్రమో మరి?

అందమైన రూపం వెనక ఎంత నైచ్య బుద్ధి దాగుందో! ఇటువంటి వాళ్ళకు భగవంతుడు అందమైన రూపంకూడా ఇస్తాడు. ఎందుకనో? అతని నా స్థితిలో విడిచి పోవడానికి స్త్రీ సహజమైన సానుభూతి అంగీకరించడం లేదు.

తన కర్చీఫ్‌ని తడిపి దానితో తలమీద కారిన రక్తాన్ని తుడిచింది. నుదురుపైన గాయాన్ని అదిమి పట్టింది కాస్సేపు. అలా నొక్కితే ర[illegible] ఆగుతుందని ఎవరో చెప్పగా విన్న గుర్తు[illegible]ణంలో ఆచరించింది. రక్తం కారడం తగ్గింది. అతను కొద్దిగా కదిలి బాధగా మూలిగాడు.

అతను కదిలేసరికి అరవిందకు మళ్ళీ భయం పట్టుకుంది. అతను లేచి పోలీసులకు అప్పగిస్తాడేమోనని. అంతలోనే మొండి ధైర్యం. తను తన శీలరక్షణ కోసమే అలా చేసింది కాని, అతన్ని చంపాలనే ఉద్దేశ్యం ఉంటే కదా తను భయపడడానికి? ఆ మాటే చెప్తుంది ధైర్యంగా.

అతనీసారి కళ్ళు తెరిచి—"దాహం" అన్నాడు హీన స్వరంతో.

టేబిల్‌మీద ఉన్న గ్లాసు తెచ్చి అతని నోటికి కొద్దికొద్దిగా నీళ్ళు పోసింది.

"ఇక చాలు" అన్నా డతను.

"సార్! లేవగలరా? మిమ్మల్ని మంచం మీద పడుకోబెట్టి వెళ్ళి డాక్టర్‌ను తీసుకొస్తాను" అంది తడబడుతూ.

అతను చేయి చాపాడు పట్టుకోమన్నట్లుగా. అతని చేతిని పట్టుకుని నెమ్మదిగా లేవదీసింది. అతను పడిపోకుండా భుజం చుట్టూ చేయి వేసి పట్టుకుని నెమ్మదిగా నడిపిస్తూ అతని బెడ్‌రూమ్‌లోకి తీసుకు వెళ్ళింది.

"మీ ఫామిలీ డాక్టరు పేరు చెప్పండి, సార్ తీసుకొస్తాను" అంది.

"అసలు ఫామిలీ ఉంటేగా డాక్టర్ ఉండటానికి? అయినా డాక్టరు వస్తే ఏం చెపుతావు? ఈ దెబ్బ ఎలా తగిలింది అంటే నిజం చెప్పగలవా? చెప్పి ఈలోకంలో బ్రతక గలవా? ఏ డాక్టరూ అక్కర్లేదు. అలమారులో అయోడిన్ ఉంటుంది. దూదికూడా అక్కడే ఉంటుంది. అదివేసి దూది అంటించి వెళ్ళు. అదీ నీకు చేయాలని ఉంటేనే. లేకపోతే అదీ వద్దు. మా నౌకరు వచ్చాక వాడే వెళ్ళి డాక్టరును తీసుకు వస్తాడు. నీవు ఇంటికి వెళ్ళిపో. ఈరోజు జరిగింది నీ జీవితంలో ఒక పీడ కలగా మరిచిపో. దట్సాల్." అతను ఆయాసంతో కళ్ళు మూసుకున్నాడు.

అరవిందకు అక్కడినుంచి ఎంత త్వరగా బయట పడతానా అనే తొందర ఉంది. అలా అని అతన్ని దిక్కూ మొక్కూలేని వాడులా నిస్సహాయంగా వదిలి పెట్టి పోవడానికి ప్రాణం ఒప్పడం లేదు. ఇంతకన్నా చెడ్డ పేరు ఇంకేం వస్తుంది? వచ్చిం దేదో ఇదివరకే వచ్చింది అనుకుంటూ అలమారులో వెతికి అయోడిన్, దూది తీసి, అతని గాయానికి వేసి కట్టు కట్టింది. అప్పుడు వచ్చాడు నౌకరు.

వచ్చి యజమానిని ఆ స్థితిలో చూసి కొయ్యబారి పోయాడు ఒక క్షణం. అంతలో తేరుకుని, "ఎలా జరిగింది?" అంటూ అడగడం మొదలు పెట్టాడు, వాడి మాతృభాషలో.

**FREE !** ముత్యాల సరాలు ఉచితం !

## త రు ణ ము

1980 ఫిబ్రవరి మాసం 16వ తేదీ హైదరాబాదులోని ప్రజలకు మరపురాని రోజు. ఆ నాడు సంపూర్ణ సూర్యగ్రహణం. దాన్ని వీక్షించుటకు ప్రపంచములోని వివిధ భాగముల నుండి అనేక మంది శాస్త్రజ్ఞులు పాలెం అనే గ్రామం చేరుకొన్నారు. జంట నగరాల నుండి నూట యాభై కిలోమీటర్ల దూరంగా నున్న ఉమామహేశ్వరి కొండల దగ్గిర కూడ అనేక మంది శాస్త్రజ్ఞులు చేరి ఈ సూర్యగ్రహణాన్ని తిలకించారు. ఇటు వెన్నెలా కాదు. అటు విద్యుత్ దీపాల కాంతి కూడా కాదు. ఈ రెండింటికి భిన్నంగా సూర్యచంద్రుల సయ్యాటములో ఉత్పన్నమైన సుందర కాంతి కిరణాల వెలుగుతో కూడిన మనోజ్ఞ దృశ్యాన్ని అనేక మంది నిశ్శబ్దంగా వీక్షించారు. ఇటువంటి తరుణం జీవితంలో ఒక్కసారి కూడ తటస్థపడని వారు ఎంతో మంది ఉన్నారు. అయితే మన తరములు దీనిని వీక్షించే తరుణము మనకు కలుగుట గొప్ప భాగ్యము.

అయితే ఈ భాగ్యాన్ని అనేక మంది పోగొట్టుకొన్నారు. కిటికీలు తలుపులు కూడ మూసివేసి అసలు బయటికి కూడ రాకుండా ఇంట్లోనే కూర్చుండి పోవటం ఎంతో దురదృష్టం. ఏదేదో కీడును శంకించి అంతరిక్షములో మానవుల కళ్ళ ఎదుట జరిగిన ఈ అరుదైన సంఘటన వీక్షించకుండా తలుపులు బిగించి కూర్చుండి పోయారు. అపూర్వమైన ఇటువంటి తరుణాలు అందరికీ అందుబాటులో లేవు. మానవ జీవితాల మీద దొర్లి పోయిన కాలచక్రాన్ని మరలా వెనుకకు త్రిప్పి గడచి పోయిన ఘడియలను ఎవరూ తిరిగి మనకు అందివ్వలేరు. అనేక సార్లు జీవితములో తరుణం అనేది ఒక్కసారే తలుపు తట్టుతుంది. దాన్ని జార విడుచుకొంటే తిరిగి రమ్మన్నా రాదు. మంచి క్రియలు చేయుటకు వచ్చిన తరుణాలు, మంచి విద్యను అభ్యసించుటకు ఇవ్వబడిన తరుణాలు మంచి నిర్ణయాలు చేసికోవలసిన తరుణాలు ఒక్కసారి చెయ్యిదాటిన పిమ్మట వాటిని తిరిగి పొందటం అనేకులకు అసాధ్యం. అన్నిటికన్నా ముఖ్యంగా మానవులు తమ పాపజీవితము నుండి తిరిగి పోయి నూతన వ్యక్తులుగా జీవించుటకు తోడ్పడుచున్న తరుణాన్ని జారవిడచిన పిమ్మట వారు తిరిగి లేవకుండా అధోగతికి జారిపోవుటకు ఒక క్షణం కూడా పట్టదు. సంపూర్ణ సూర్యగ్రహణం ఇంచుమించు రెండు గంటల కాలం పట్టి తిరిగి విడిచింది. మరి గడచి పోయిన ఆ అద్భుత క్షణాలు మళ్ళీ జీవితంలో రమ్మన్నా రావు. అలా తటస్థపడిన అద్భుత క్షణాలను సద్వినియోగం చేసుకొన్నవారు ఎంత జ్ఞానులు!

చీకటిలో మెరిసే ఎద్దు కళ్ళను పరిశీలించి చూచి "గలిలియో" లెన్సు యొక్క మూల సూత్రాన్ని కనుగొన్నాడు. టీ కెటిల్ మూత ఆవిరి వలన లేపబడటం చూచిన "వాట్స్" ఆవిరి యంత్రమును తయారు చేయుటకు పూనుకొన్నాడు. గాలి ఏ దిక్కు నుండి వస్తుందో చూచిన "కొలంబస్" సమీపములోనే భూమి ఉందని గ్రహించాడు. సాధారణమైన ఇలాంటి సంగతులు అనేకుల కంటికి కన్పించ వచ్చుగాని వాటిని ఉపయోగించు కొనుటలో లేక నిర్లక్ష్యము చేయుటలో వారి జ్ఞానము లేక మూఢత్వము వెల్లడి అవుతుంది.

పాపబంధముల నుండి రక్షింపబడే తరుణాన్ని కూడ అనేకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. క్రీస్తు ప్రభువు అనుగ్రహించే వుచితార్థమైన రక్షణము మనము నిర్లక్ష్యము చేసిన యెడల దైవ తీర్పును తప్పించుకొన లేము. ఇదే అనుకూల సమయము, ఇదే ఆ రక్షణ దినము అనుకొని ఈనాడే ఆ క్రీస్తు ప్రభువుని గురించి తెలుసుకొనండి.

-చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం !! ఉచితం !!!

కరుణామయుడైన యేసుక్రీసు జీవిత చరిత్ర, మానవాళికి ఆయన చేసిన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొంద దలచుకుంటే మీ విరునామా వెంటనే వ్రాయండి. పోసు ఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తకం పంపుతాము.

ఫార్ కార్నర్స్,
పోస్టు బాక్సు నెం. 35,
ఖైరతాబాద్,
హైదరాబాద్-4.

**FAR CORNERS.**

**GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS.**

"తలుపుమీద పడిపోతే దెబ్బ తగిలిం"దనిచెప్పింది అరవింద.

వాడికి తెలిసిందో లేదో కాని బిక్కముఖం వేసుకుని అయ్యగారివైపు చూడసాగాడు.

సంధ్య చీకట్లు ఆ గదిని మరింత చీకటి చేస్తూంటే నౌకరే లైటు వేశాడు. అంతవరకు చీకటిగా ఉన్న గది క్షణంలో కాంతితో నిండిపోయింది.

"నేను వెళతాను సార్. మీనౌకరు వచ్చాడుకదా?" వెళ్ళ నుద్యుక్తురాలయింది అరవింద. ఆఫీసరు కళ్ళు తెరిచి నౌకరుని దగ్గరగా పిలిచి కన్నడంలో ఏదో చెప్పాడు. వాడు 'అలాగే' అన్నట్లు తల ఊపి, "రండమ్మా వెళదాము" అన్నాడు.

తన చెవులు పొరబడలేదు కదా అన్నట్లు కళ్ళు వెడల్పు చేసుకుని, నౌకరు వైపు చూడసాగింది అరవింద. వీడు తన నెంత మోసం చేశాడు! అనే భావం తొంగి చూసింది ఆ చూపుల్లో. వాడివెంట వెళ్ళడానికి మనస్కరించక— "నేను వెళ్ళగలను, సార్" నిగబగబ బయటికి వెళ్ళిపోయింది.

* * * *

ఆ రాత్రి అరవిందకు నిద్రపట్టలేదు. కళ్ళు మూస్తే భయంకరమైన ఆలోచనలు—ఆఫీసరుగారు చచ్చిపోయినట్లు. అతని మరణానికి తనే కారణమని ఆరోపిస్తూ పోలీసులు తనను బంధించి తీసుకెళ్ళి జైలులో బంధించినట్లు, అక్కడ వాళ్ళు తనను నానా హింస పెట్టినట్లు, తనను చూసి అందరూ హేళనగా నవ్వుతున్నట్లు. భయంతో గుండె దడదడమంది. ఒళ్ళంతా ముచ్చెమట్లు పోశాయి. 'భగవాన్! అతను క్షేమంగా ఉండాలి. అతనివల్ల నాపేరు న్యూసెన్స పడకూడదు' అనుకుంది దిగులుగా.

ఆ మరునాడు ఆఫీసుకు సెలవు పెట్టింది. కాని, భయంతో ఎన్నాళ్ళు ఇంట్లో దాక్కుంటుంది? మూడవ రోజు ఆఫీసుకు వెళ్ళింది.

ఆఫీసరు కూడా లీవ్ పెట్టినట్లు తెలిసింది. తల మీద గాయంతో ఆఫీసుకు రావడానికి అతనికి మొహం చెల్లలేదేమో? ఆ గాయంతో అతనికి సీరియస్ అయిందేమో? అరవింద ఆలోచనలు ఇలా సాగుతూంటే, లేడీ క్లర్కు రోజా అడిగింది. "అలా ఉన్నావేం? ఒంట్లో బాగా లేదా? నిన్న సెలవు పెట్టావు కూడా. ఈరోజు కూడా నీవు రాకపోతే మీ ఇంటికి రావాలనుకున్నాను" అని. గొంతు తగ్గించి—"ఈ సంగతి తెలిసిందా?" అంది ఏదో రహస్యం చెపుతున్నట్లు.

గతుక్కుమంది అరవింద. "ఏ సంగతి?" అంది తడబడుతూ.

"మన ఆఫీసరుగారి తలకు దెబ్బ తగిలిందట. రాత్రి నిద్రలో మెట్లు దిగి వస్తూంటే కాలు జారి ముందుకు తూలి పడిపోయారట. తల గోడకు కొట్టుకుందట. పాపం! చాలా పెద్ద దెబ్బే తగిలిందట."

రోజా మాటలకు అడ్డు వస్తూ, "ఈ సంగతి నీకెలా తెలిసింది? ఎవరు చెప్పారు?" అని అడిగింది అరవింద.

"మన హెడ్‌క్లర్కు విశ్వంగారు నిన్న వాళ్ళ రూముకు వెళ్ళారట, ఏవో కాగితాల మీద సంతకాలు పెట్టించడానికి. ఆయన మంచం మీద

పడుకుని ఉన్నారట. తలకు కట్టు కట్టి ఉందట. ఆయన నౌకరు చెప్పాడట ఇలా అని."

"ఉహూ! అలాగా? పెద్ద దెబ్బే తగిలిందని చెప్పారా విశ్వంగారు?"

"ఏమో? ఆ సంగతి సరిగ్గా తెలియదులే కాని, నా ఉద్దేశం ఆయనకు కాలు జారి పడితే దెబ్బ తగలలేదని, ఏ ఆడపిల్లో దేహ శుద్ధి చేసి ఉండ వచ్చని. అసలు ఆయన బుద్ధి అంత మంచిది కాదట. కాస్త అందంగా, కంటికి నదురుగా కను పించిన ఆడపిల్లను విడిచి పెట్టడట. అదీకాక తాగడం మొదలు పెట్టాడంటే ఒళ్ళు తెలియ కుండా తాగుతాడట. క్లబ్బు కెళ్ళి బాగా తాగి వచ్చి ఉంటాడు. తాగి ఏ ఆడ పిల్లనో బలా త్కారం చేసి ఉంటాడు. బస్! తగిన శాస్తి జరిగింది!" నవ్వింది రోజా.

అరవింద మాట్లాడలేదు. ఏం మాట్లాడు తుంది? రోజా వూహించి చెప్పినా ఇంచు మించుగా యథార్థమే చెప్పింది, మరి. అతనికి బుద్ధి చెప్పింది తనే అని చెపితే? అమ్మో! ఇంకేమైనా ఉందా? అతని వెంట ఎందుకు వెళ్ళావు? ఎలా వెళ్ళావు? అనే ప్రశ్నలు ఎన్నో వస్తాయి. వాటికి జవాబు చెప్పగల శక్తి, ఓపిక తనకు లేవు కాబట్టి మవునంగా ఉండటమే శ్రేయ స్కరం అనుకుం దామె.

ఆఫీసరు లీవ్‌లో ఉన్నాడు కనక క్లర్కులు, మిగతా స్టాపు బల్లల చుట్టూ చేరి కబుర్లు చెప్పుకో సాగారు. వాళ్ళ మాటల్లో ముఖ్యాంశం—ఆఫీసరు గారి తలకు దెబ్బ తగిలింది. అది ఎలా తగిలింది? ఎందుకు తగిలింది? ఎప్పుడు తగిలింది? అన్నదే.


"గురుడు బాగా తాగి కైపెక్కి ఉంటాడు. అందుకే ఒళ్ళు తూలి పడి పోయి ఉంటాడు" అని ఒకరు, "కాదు, ఏ ఆడపిల్లో బుర్ర బద్దలు కొట్టి ఉంటుంది" అని ఇంకొకరు. ఇట్లా ఎవరికి తోచినట్లు వాళ్ళు చెప్పుకుంటున్నారు.

కాని, అరవింద మాత్రం మరోకలా అనుకో సాగింది—ఆఫీసరుగారి తలకు దెబ్బ తగిలిందనే సాను భూతి వీళ్ళలో ఒక్కరికీ లేదు కదా! అని.

• • •

ఆ మరునాడు ఆదివారం. ఆ రోజు బట్టలన్నీ ఉతుక్కుని ఇస్త్రీ చేసుకుంటుంది అరవింద. ఆ రోజూ అలాగే ఆరిన బట్టలన్నీ తీసి మడత పెట్టుకుంటున్నది. ఇంటివా రమ్మాయి స్వర్ణ వచ్చి—"ఏదైనా పిక్చర్‌కి వెళదామా, అక్కా?" అని అడిగి, అరవింద రానసే సరికి ముఖం ముడుచుకుని వెళ్ళి పోయింది.

ఆ అమ్మాయికి పదహారేళ్ళు ఉంటాయి, టెన్త్ పాసయి, పెళ్ళి కోసం ఎదురు చూస్తూ, కాలం గడపడానికి, సినిమాలు చూడటం, కథలు, నవలలు చదవటం చేస్తూంది. ఆ అమ్మాయిని ఇంట్లో వాళ్ళు ఒంటరిగా వెళ్ళ నివ్వరు. ఎవరైనా పెద్ద వాళ్ళు వెళితేనే వాళ్ళ వెంట పంపిస్తారు. అందుకని నువ్వొస్తావా? నువ్వొస్తావా? అని అందరినీ అడుగుతూ ఉంటుంది. ఒక వారం అరవింద వెళితే మరొక వారం అవతలి వాటాలో ఉంటున్న చంద్రకళ వెళుతుంది.



అరవింద రానసే సరికి ఆ అమ్మాయి చంద్రకళ దగ్గరికి పరుగెత్తింది.

అరవింద నవ్వుకుంటూ తన పని చేసుకో సాగింది. ఇంతలో గుమ్మం ముందు తిరిగి అలికిడి అయింది. 'బహుశా చంద్రకళ కూడా రానంది కాబోలు, తిరిగి తననే బ్రతిమాలడానికి వచ్చి ఉంటుంది ఈ పిల్ల' అనుకుంటూ తల ఎత్తి వచ్చినది ఎవరో చూడకుండానే "నీ పని ఎంత వరకు వచ్చింది?" అంది.

"మీ కోసమే వచ్చా నమ్మాగారూ. అయ్య గారికి సాన జ్వరంగా ఉంది. ఆయన్ని సూత్తుంటే భయం వేస్తుంది, ఒక్కసారి వచ్చి వెళ్ళండమ్మా" అంటున్నాడు ఆఫీసరు ఇంట్లో ఉన్న నౌకరు.

ఆ మాట వింటూనే ఉలిక్కి పడి తల ఎత్తి తిరిగి చూసింది అరవింద.

వచ్చిన మనిషి దిగులుగా, ఆర్తింపుగా చూస్తు న్నాడు.

'ఇది కూడా మోసం కాదుగదా? అయినా, ఆయనకు జ్వరం వస్తే తనేం చేస్తుంది? తన వల్ల జ్వరం తగ్గుతుందా? ఏ డాక్టరు చేత అయినా చూపించుకోవాలిగాని?' లోలోపల విసుక్కుంటూ, "డాక్టరు వచ్చి చూశాడా?" అంది.

"ఆ బాబొచ్చి చూసి మందు రాసిచ్చారు. ఆ అయ్యని చూస్తే నా కేదో భయంగా ఉంది తల్లీ. అమ్మా, నాన్నా ఎవరూ లేరు. ఆయన్ని ఎత్తుకుని మోసి పెంచిన వాణ్ణి, సిన్నప్పటి నుంచీ. సిన్నప్పుడు ఎంత మంచి పేరు తెచ్చుకున్నాడో ఇప్పు డంత సెడ్డ పేరు ఉంది. అయినా, పెంచిన మమకారంతో ఆ అయ్యని విడిచిపెట్టి వెళ్ళ లేక పోతున్నాను. ఇవి సేతులు కావు. ఒక్క పాలి మీరొచ్చి సూడాలి." అతను చటుక్కున అరవింద చేతులు, పట్టుకుని ప్రాదేయ పడసాగాడు.

"నేను వచ్చి ఏం చేయను? అక్కడికి వస్తే, మీ ఆఫీసరు మాటఎలా ఉన్నా ముందు నాకు చెడ్డ పేరు వస్తుంది. ఆ పేరుతో తల ఎత్తుకు తిరగలేను" అనాలనుకుంది. కాని, అతని ముఖం చూస్తూ ఆమాట అనలేక పోయింది. "ఉండు, ఇప్పుడే వస్తాను" అని మడత పెట్టిన బట్టల్ని పెట్టెలో సర్దుకుని, గదికి తాళం వేసి అతనివెంట బయలుదేరింది.

"అతన్ని ఎత్తుకుని పెంచానంటున్నావు కదా? మరి, అతను తప్పు తోవలో పడినప్పుడు మందలించ లేదా?" అని అడిగింది అరవింద.

"వాళ్ళ ఉప్పు, పులుసు తినే నౌకర్ని. నా కంత చనువు ఎలా ఉంటుందమ్మా? అక్కడికీ అప్పు డప్పుడూ మందలిస్తూనే ఉన్నాను — 'ఇది మంచి పద్ధతి కాదు, బాబూ. ఒక అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోండి' అని. అయినా, ఆ బాబు ఇంటే గందా?

'నాకెందుకోయ్ పెళ్ళి! అసలు ఏ ఆడదాన్నీ నమ్మ కూడదు. పెళ్ళి అసలు చేసుకోకూడదు. అందంగా ఉన్నాయని పువ్వుల్ని వాసన చూడకుండా, నలప కుండా ఉంచగలమా? అలాగే వాడిన పూలను దాచి ఉంచగలమా? ఆడదాన్ని కూడా అనుభవించి విడిచి పెట్టేయాలి—తెలిసిందా?' అని నవ్వేస్తారు.

'అలా ఎంత కాలం?' అంటే— 'సాగినంతకాలం. ఆ తరవాత ఏమో?' అంటారు. ఆ రోజు మిమ్మల్ని చూసి చాలా జాలిపడ్డాను. 'ఈయన చేతిలో ఎలా సిక్కావమ్మా?' అనుకున్నాను, లోలోపల బాధగా. 'అయ్యగారి కూడా ఎందుకొచ్చావు? వెనక్కి వెళ్ళిపో' అందామంటే ఎదురుగా ఆ బాబు ఉన్నాడు. అదీకాక నాకు తెలుగే రాదని చెపుతున్నారు మీతో. అక్కడ ఉండి ఆ పాప కృత్యాన్ని కళ్ళారా చూడలేక, కడుపు మీద కొట్టుకుంటూ ఏదో వాగి బయటికి పారి పోయాను.

అయ్యగారు అప్పుడప్పుడు అందమైన ఆడ పిల్లల్ని తీసుకురావడం, తెల్లవారి పంపేయడం నాకు తెలుసు. కాని, ఆ రోజు ఎందుకో అయ్యగారి ప్రవ ర్తన నాకేమీ నచ్చలేదు. ఆయన్ని ఏవగించుకుం టూనే అన్నీ అమర్చి వెళ్ళిపోయాను. వెళుతూ వెళుతూ ఈయనకు బుద్ధి ఎప్పుడు వస్తుందా? అనుకున్నాను మనఃస్ఫూర్తిగా.







ఒక గంట, రెండు గంటలు తిరిగి వస్తాను. ఆ రోజు వచ్చేసరికి నువ్వు వెళ్ళిపోయి ఉంటావని అనుకున్నాను. కాని, నేను అనుకున్నది ఒకటే, అక్కడ జరిగింది మరొకటీను. అయ్యగారిని ఆ స్థితిలో చూసి తెల్లబోయాను. అందుకు కారణం మీరే అనుకోగానే కోపంతో రెచ్చిపోయాను. కాని, అంత కోపాన్నీ అప్పుడు ప్రదర్శించకూడదని తమాయించుకున్నాను." అతను చెప్పడం ఆపి గాఢంగా నిట్టూర్చాడు.

"మరి, నామీద కోపం పోయిందా ఇప్పుడు?" నవ్వింది అరవింద.

"ఆఁ ఈ రెండు రోజులనుంచీ అయ్యగారు జ్వరం తీవ్రతలో ఉండి కూడా మీ మంచితనాన్ని పొగుడుతూంటే మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకున్నాను. అందుకే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. అయ్యగారిని మంచి మనిషిగా తీర్చి దిద్దగలిగే శక్తి మీ ఒక్కరికే ఉంది, అమ్మా. ఆ నమ్మకం ఉంది నాకు."

'మంచి నమ్మకమే! అతి వినయం ధూర్త లక్షణం అన్నట్లు ఈ ముసుగు వేసుకుని వచ్చావా?' కసిగా మనసులో గొణుక్కున్న అరవింద అతనికి సమాధానం చెప్పకుండా ఊరుకుంది.

ఇల్లు సమీపిస్తూంటే ఆమె గుండె అతి వేగంగా కొట్టుకోసాగింది. అతను తనను మరొకసారి మోసం చేయడానికి ఇదొక పన్నుగడ కాదుగదా? అనే సందేహం మనసులో. భగవంతుడి మీద భారం వేసి ఆ ఇంట్లో కాలు పెట్టింది.

ఒంటిమీద స్పృహలేని స్థితిలో పడి ఉన్నాడు మోహన్‌రావు. డాక్టర్ వ్రాసి ఇచ్చిన మందులు స్టూలుమీద ఉన్నాయి.

జంకుతూనే చేతితో నుదురుతాకి చూసింది అరవింద. వేడిగా తగిలింది చేతికి.

"డాక్టరేమన్నారు? మళ్ళీ ఎప్పుడు వచ్చి చూస్తా నన్నారు?" అడిగింది.

"ఒక గంట పోయాక వస్తానన్నారు. లేస్తే ఈ టాబ్‌లెట్ వేసి, గ్లూకోజు నీళ్ళిమ్మన్నారు."

"ఇచ్చావా మరి?"

"ఉహూ. అసలు అయ్యగారు లేస్తేకదా ఇవ్వడానికి? ఉదయం నుంచి అలాగే పడి ఉన్నారు."

అతని నుదురుమీద తడిగుడ్డ వేసింది అరవింద. అతనివైపే చూస్తూ కూర్చుంది నిశ్శబ్దంగా. క్షణాలు గడుస్తున్నాయి.

"మీకు కాఫీ తీసుకురానా, అమ్మా?"

"ఇప్పుడేమీ వద్దు కాని, నీ పేరేమిటో చెప్పు ముందు." అడిగింది.

"దాసయ్య అంటారమ్మా." అతను దూరంగా వెళ్ళి గుమ్మానికి ఆనుకుని కూర్చున్నాడు.

ఒక గంట తరవాత మోహన్‌రావు కదిలాడు. "దాహం" అన్నాడు క్షీణ స్వరంతో.

వేడి నీళ్ళలో గ్లూకోజు కలిపి, స్పూనుతో కొద్ది కొద్దిగా అతని గొంతులో పోయసాగింది అరవింద. అయిదారు స్పూన్లు తాగి, ఇక వద్దు అన్నట్లు చేయి అడ్డు పెట్టాడు.

"సార్! మీ కెలా ఉంది? లేచి కూర్చోగలరా?" ఆత్రతగా అడిగిం దామె. అతను మాట్లాడలేదు. మళ్ళీ మగతలో పడిపోయాడు. ఉండి ఉండి పలవరించే వాడు—"నన్ను క్షమించు, మిస్!" అనీ, "నీవు కూడా అందరిలాంటి ఆడపిల్లవే అనుకున్నాను" అనీ,

"నన్ను ఆ రాస్కెల్ సావిత్రి మోసం చేసింది. నా జీవితంతో ఆడుకుంది. మరొకడిని పెళ్ళి చేసుకుంది" అనీ.

"సావిత్రి ఎవరు? నీకు తెలుసా, దాసూ? ఆమెను మీ అయ్యగారు ప్రేమించారా?"

"అదొక పెద్ద కథలెండమ్మా. తరవాత మీకు అంతా వివరంగా చెప్తాను." నుదురు రుద్దుకుంటూ అన్నాడు దాసు.

"ఆ విషయాలన్నీ నా కెందుకులే, దాసూ, చెప్పడం? ముందు మీ అయ్యగారికి బాగా తగ్గిపోనియ్యి." ప్రతి వారి జీవితంలోనూ ఒక గాథ ఉంటుంది. అది వెలికి తీస్తే బాధే మిగులుతుంది చివరికి. అటువంటివి తలుచుకున్నందువల్ల వచ్చే లాభమూ ఉండదు—అని మనసులో అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చిం దామె.

ఆ రోజంతా అక్కడే ఉండిపోయింది. అతనికి మెలకువ వచ్చినప్పుడెల్లా మందు వేయడం, గ్లూకోజు నీళ్ళో, కాఫీయో తాగించడం చేస్తూ వచ్చింది.

ఆ మరునాటికి అతనికి బాగా స్పృహ వచ్చింది. "రాత్రంతా ఇక్కడే ఉన్నారా?" అని అడిగాడు. "నా కేమయింది? ఈ మందులేమిటి?" అని అడిగాడు.

దాసయ్య నెమ్మదిగా అంతా వివరించి చెప్పాడు. "మిమ్మల్ని ఇలా ప్రాణాలతో చూస్తాననుకోలేదు, అయ్యా" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. "ఆ అమ్మాయిగారే మీ ప్రాణాలు నిలిపారు, బాబూ."

మోహన్‌రావు అరవింద వైపు కృతజ్ఞతతో చూశాడు. ఆమె ఇబ్బందిగా చూసి, చటుక్కున తల వాల్చేసుకుంది.

రెండు రోజులు గడిచేసరికి మోహన్‌రావుకు బాగా తగ్గి లేచి తిరగసాగాడు. నుదుటిమీద గాయం కొద్దిగా మానుపట్టింది. ఆ గాయం చూస్తుంటే అరవిందకు బాధగానూ, బిడియంగానూ ఉంటున్నది. 'నేను మనిషిలా ప్రవర్తించలేదు. మూర్ఖంగా ప్రవర్తించాను. ఒక మనిషిని బాధకు గురిచేశాను' అని పదే పదే అనుకుంటూ పశ్చాత్తాప పడేది. ఆ స్పందనతోనే అతనికి ఆ నాలుగు రోజులూ శుశ్రూష చేసింది. తిరిగి అతన్ని మామూలు మనిషిని చేసింది.

పూర్తి ఆరోగ్యం చేకూరినా, ఇంకా ఆఫీసుకు రావడం లే దతను.

ఆఫీసుకు వెళ్ళే ముందు, ఆఫీసునుంచి వస్తూనే అతన్ని చూడటానికి వెళ్ళేది అరవింద.

■ ■ ■

ఆ రోజు ఆదివారం. వంటా, స్నానం పూర్తిచేసి భోజనం చేయడానికి కూర్చుం దామె.

"అమ్మగారూ!" అంటూ వచ్చాడు దాసయ్య. ఈ నాలుగు రోజులనుంచీ అరవింద వెళ్ళి రావడంతో అతనికి కొంత చనువు ఏర్పడింది. రోజులో ఏదో ఒక సమయంలో అక్కడికి రావడం, చిన్న చిన్న పనులు చేసి పెట్టడం కాక, బజారు వెళ్ళి కావలసిన సరుకులు తీసుకురావడం, ఇల్లు నీటుగా సర్దడం చేస్తుంటాడు.

"కూర్చో, దాసూ. మీ అయ్యగారి కెలా ఉంది? రేపటినుంచి ఆఫీసుకు వస్తారా?" అడిగింది గదిలోంచే.



## చిదంబర రహస్యం

అతను పరమ దుర్మార్గుడు. వ్యభిచారి తాగుబోతు. మోసగాడు. అలాంటి వాడు ఎన్నికల్లో గెలవడం అంటే ఆశ్చర్యమే. ఆ విషయమే అతనిని అడిగితే అన్నాడు: "నా ప్రత్యర్థికి ఈ సుగుణాలు నా కంటే ఎక్కువగా ఉన్నాయి. అందుకు, నా కంటే అతనిని ద్వేషించే వారే ఎక్కువ. అతను రాకూడదనుకున్న వాళ్ళ వోట్లన్నీ నాకు పడ్డాయి" అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ.

"ఉదయం నుంచీ తలనొప్పంటూ పడుకున్నారు. రెండుసార్లు తలనొప్పి మాత్ర వేసుకొని కాఫీ తాగారు. ఒళ్ళుకూడా వెచ్చగా ఉంది. అందుకే మీ దగ్గరికి పరుగెత్తుకొచ్చాను. మీరు వచ్చి చూస్తేనే కాని నాకు ధైర్యంగా ఉండదు, అమ్మా." టేబిల్‌మీద చిందర వందరగా పడి ఉన్న పుస్తకాలను, టాయిలెట్ సామాన్లను సరిగ్గా సర్దుతూ అన్నాడు దాసు.

'నేనొచ్చి చూసినంతలోనే అయ్యగారికి తగ్గిపోతుందా, నీ చాదస్తం కాని!' అనాలనుకుంది అరవింద. కాని, తను వస్తేనే కాని అక్కడినుంచి ఒక్క అంగుళమన్నా కదలడని అనుభవ పూర్వకంగా తెలుసుకుంది కాబట్టి, ఆ మాటను గొంతులోనే అదిమిపట్టి—"అలాగే వెళదాము. కాసేపు కూర్చో, దాసూ" అంది.

దాసుకు ఇరవై నాలుగు గంటలూ తన యజమానిని పొగడటంతోనే సరిపోతుంది. అయ్యగారి చిన్నప్పటి చేష్టలు, ఎదిగిన తరవాత అయ్యగారి ప్రవర్తన, వయస్సులో ఉన్నప్పుడు అయ్యగారు చేసిన ఆకతాయి పనులు విసుగు లేకుండా చెప్పిందే చెపుతూ మురిసిపోతూంటాడు. అలా చెప్పడంలో అతనికి చాలా ఆనందం లభిస్తుంది కాబోలు. చెప్పిందే పదిసార్లు చెపుతూంటే వినడానికి విసుగు పుట్టుతున్నా, ఎదుటివాళ్ళ మనసు నొప్పించలేని తత్త్వంకల ఆమె అతన్ని వారించే ప్రయత్నం చేసేది కాదు.

తిన్నాననన్న పేరుకు రెండు ముద్దలు తిని, అతని వెంట బయలు దేరింది.

గుమ్మం దిగుతూంటే—"అక్కా! సినిమాకేనా?" అని అడిగింది స్వర్ణ.

"ఊహూఁ, ఇప్పుడే ఒక గంటలో వస్తాను. రెడీగా ఉండు. నిన్ను సినిమాకు తీసుకువెళతాను" అంది నవ్వుతూ.

"ఓ! నేను రెడీగానే ఉంటాను. నువ్వే రావాలి త్వరగా." ఉత్సాహంగా అరిచింది స్వర్ణ.

"ఆయనకు దగ్గర వాళ్ళుకానీ, దూరపువాళ్ళుకానీ బంధువు లెవరూ లేరా?" ఇల్లు సమీపిస్తుండగా అడిగింది అరవింద.

"ఊహూఁ ఎవరూ లేరమ్మా. అయ్యగారికి ఊహ రాకముందే తండ్రిపోయాడు. రెండేళ్ళ క్రితం తల్లిపోయింది. అందుకే అయ్యగారు మరీ మొండికెత్తిపోయారు.

డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు పెడుతూంటే చూస్తూ ఊరుకోలేక 'అలా ఖర్చు పెట్టకండి, బాబూ' అని వారిస్తే చాలు—'నాకెవరున్నారు దాసూ? అమ్మా? నాన్నా? తోబుట్టువులా? ఎవరి కోసం డబ్బు దాచాలి?' అని ఎదురు ప్రశ్న వేస్తారమ్మా. ఆ మాట వింటే కడుపు చెరువైపోతుంది. ఇక ఏమీ అన బుద్ధి కాదు. మరి, అయ్యగారు మామూలు మడిసి కాదు అనిపిస్తుంది. ఎప్పటికి బాగుపడతారో! అంతా ఆ భగవంతుని దయ." దాసు విచారంగా అన్నాడు.

"అయ్యగారు పెళ్ళి చేసుకుంటే ఆవిడగారే ఆయన్ను దారిలోకి తెచ్చుకుంటుంది, దాసూ. నువ్వు కంగారు పడినంతలోనే ఏ సమస్యా తీరదు. ముందు మీ అయ్యగారికి ముడి పెట్టడానికి ఒక అమ్మాయిని చూడు" అం దామె నవ్వుతూ.

ఒక క్షణం ఆమెవైపు పరీక్షగా చూసిన దాసు ముసిముసిగా నవ్వుతూ — "ఈ మధ్యే ఒక అమ్మాయిని చూశానమ్మా మరి భగవంతుడు సల్లగా సూత్తే ఆ అమ్మాయే కావాల అయ్యగారికి జోడి" అన్నాడు.

"మీ అయ్యగారు చూసి అంగీకారం తెలిపారా?"

"ఊహూఁ. ఇంకా అంతవరకు రాలేదు. అసలు ఆ అమ్మాయిగారినే అడగలేదు. మా అయ్యగారి గురించి. ఇదిగో, అయ్యగారికి కాస్త బాగా కులాసా చిక్కగానే సంగతి తెలుసుకుంటాను."

"అయితే త్వరలో మాకు మంచి పార్టీ ఉందన్న మాట! ఇంతకీ ఆ మీ కాబోయే అమ్మగారిది ఈ ఊరేనా? చదువుకుంటున్నదా? లేక ఉద్యోగం చేస్తున్నదా?"

ఆ మాటకు సమాధానం చెప్పలేదు దాసు. గేటు తెరుస్తూ, "అయ్యగారు లేచారేమోనమ్మా?" అన్నాడు.

మోహన్‌రావు మంచం మీద కూర్చుని ఉన్నాడు. గదిలో అడుగు పెట్టిన దాసును చూస్తూనే "ఎక్కడికి వెళ్ళావు? అరిచి అరిచి నోరు పడిపోయింది" అన్నాడు క్షీణస్వరంతో రొప్పుతూ. జ్వరం దిగిపోయినట్లు ఒళ్ళంతా చల్లగా ఉంది.

"మీకు మళ్ళీ జొరం వచ్చిందేమోనని భయపడి ఆ అమ్మగారికోసం వెళ్ళానయ్యా. అక్కడే ఆలస్యం అయిపోయింది."

"నాకు దాహంగా ఉంది. మంచినీళ్ళు ఇవ్వు" మోహన్‌రావు దిండుకి ఆనుకుని కూర్చున్నాడు.

దాసు మంచినీళ్ళు తేవడానికి వెళ్ళబోతుంటే, అతన్ని వారించి మంచినీళ్ళలో గ్లూకోజు కలిపి తెచ్చి మోహన్‌రావుకి ఇచ్చింది అరవింద.

"మీకు శ్రమ..." అతను నొచ్చుకున్నట్లు చూసి ఆమె ఇచ్చిన నీళ్ళను తాగేశాడు.

"ఇదీ ఒక శ్రమేనా!" అంటూ నవ్వి దాను ఉన్న దగ్గరికి వెళ్ళింది. తిరిగి ఆమె మోహన్‌రావు గదిలోకి వచ్చేసరికి అతను ముడిచి పెట్టుకుని నిద్రపోతూ కనిపించాడు.

తటపటాయిస్తూ అతని నుదురు తాకింది. చేతికి చల్లగా తగిలింది. ఫరవాలేదు, జ్వరం తగ్గు ముఖం పట్టిందిలే అనుకుంది.

ఆ రోజంతా అక్కడే ఉండి పోయింది అరవింద. అతనికి గంట గంటకూ టెంపరేచర్ చూడటం, వేళకు టాబ్లెట్స్ ఇవ్వటంతోబాటు పళ్ళరసం తీసి అతనిచేత బలవంతంగా తాగించింది. మోహన్‌రావులో కాస్త శక్తి చేరుకుంది. కాస్సేపు కూర్చుని ఆఫీసు విషయాలు అడిగాడు.

తనూ రెండు రోజులనుంచీ ఆఫీసుకు వెళ్ళడం లేదని చెప్పింది అరవింద.

"నా గురించి మీరు ఆఫీసుకు కూడా వెళ్ళడం మానివేశారు. నేను చాలా అసభ్యంగా ప్రవర్తించి మిమ్మల్ని బాధ పెట్టాను. అది తలుచుకుంటేనే నాకు చాలా బాధగానూ, సిగ్గుగానూ ఉంది. నన్ను క్షమించమనే అరత కూడా పోగొట్టుకున్న వాడిని." ఆమెవైపు చూడకుండా ఎటో చూస్తూ అన్నాడు మోహన్‌రావు. అతను నోరు తెరిచి చెప్పక పోయినప్పటికీ జరిగినదానికి అత నెంత సిగ్గుపడుతున్నదీ, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నదీ అతని వదనమే చెపుతున్నది.

అతన్ని చూస్తుంటే అరవిందకు చాలా జాలి అనిపించింది. 'ప్రతి వారూ తెలిసో తెలియకో కొన్ని తప్పులు చేస్తుంటారు. కొందరు పరిస్థితులకు బానిసలై, బలహీనులై అమానుషంగా ప్రవర్తిస్తారు. కొందరు అలవాటును మానుకోలేక తప్పులు చేస్తుంటారు. అలా తప్పు చేసి, తరవాత తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో అమితంగా బాధపడేవారు ఏ కొద్దిమందో ఉంటారు. ఆ కొద్దిమందిలో ఇతనొకడు' అనుకుంది, అతనిమీద కలిగిన సానుభూతితో.

"చూడండి, మోహన్‌గారూ! జరిగిపోయిన దానికి విచారిస్తూ కూర్చునేకన్నా ఇకముందు, ముందు ఇటువంటి నైచ్య ప్రవర్తన లేకుండా మిమ్మల్ని మీరు అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించండి. 'ఫలానా వ్యక్తి మంచివాడు, సుగుణాల ఖని, బుద్ధిమంతుడు' అనే పేరు తెచ్చుకోవడానికి ఎన్నో ఏళ్ళు పడుతుంది. కాని, 'ఫలానా వ్యక్తి మంచివాడు కాదు, అతని ప్రవర్తన మంచిది కాదు' అనిపించుకోవడానికి చిన్న సంఘటన చాలు. అంద చందాలు లేకపోయినా, సహనం, శాంత స్వభావంకల అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోండి. మిమ్మల్ని చక్కగా తీర్చి దిద్దే బాధ్యత తనే తీసుకుంటుంది." ఆ మాట అని మందహాసం చేసింది అరవింద.

"పెళ్ళి! చూస్తూ చూస్తూ నాలాంటి వాడిని ఏ అమ్మాయి పెళ్ళి చేసుకోవడానికి ముందుకి వస్తుంది?" అతను విరక్తిగా నవ్వాడు.

"నన్ను చేసుకునేకన్నా పీకకు తాడు బిగించుకుని చెరువులో దూకడానికైనా ఒప్పుకుంటుంది కానీ, నీతి, నియమాలు లేని నాలాంటి వాడిని చేసుకోవడానికి చస్తే ఒప్పుకోదు. ఎవరి మాటో ఎందుకు? మిమ్మల్ని చేసుకుంటానంటే మీరు ఒప్పుకుంటారా? చూడండి అప్పుడే మీ ముఖం ఎలా మారిపోయిందో?"

"నన్నా! ఏమిటీ మీరనేది?" బెరుకుగా చూసింది అరవింద.

"జరిగినదంతా మరిచిపోయి, జాలితో తిరిగి నా సేవాభారాన్ని మీద వేసుకున్నారంటే మీ రెంత శాంత స్వభావులో, మీలో ఎంత సహనం ఇమిడి ఉందో తెలియడం లేదా?"

'ఇతనికి నిజంగానే మతి పోయిందేమో? కొంపదీసి సంధి ప్రేలాపనలు కావుకదా? పైత్యం ప్రకోపిస్తే ఇలాగే అస్తవ్యస్తంగా మాట్లాడతారు కాబోలు! ముందు ఇతన్ని ఆ ధోరణినుంచి తప్పించాలంటే ఏం చేయాలి?' అరవింద ఆలోచనలో పడింది. అలా ఆలోచిస్తుంటే తటాలున ఒక ఊహ తట్టిందామెకు.

"చూడండి, మోహన్‌గారూ! అసలు మీ రిలా స్త్రీ ద్వేషిగా మారడానికి కారణమేమిటో చెప్పగలరా? మీరు జీవితంలో ఏదో దెబ్బ తిని ఉన్నారనీ, అందుకే ఇలా ప్రవర్తిస్తున్నారనీ అనుకుంటున్నాను. సాధారణంగా ఏ కారణం లేకుండా ఎవరూ తమ జీవితాలను ఇలా నాశనం చేసుకోరు" అంది.

"అవును. మీ ఊహ అబద్ధంకాదు. నేనిలా మారడానికి ఒక ఆడదే కారణం. దాని పేరు...దాని పేరు... ఊహూఁ, పేరు ఎందుకులే! ఆ పేరు చెప్పినా పాపమే చుట్టుకుంటుంది." కోపంతో, ఉద్రేకంతో అతని ముఖం పొంగింది. పిడికిళ్ళు బిగించి మంచంకోడుమీద కసిగా కొట్టసాగాడు.

"అదంతా మీకు వినగల ఓపిక ఉందా, మిస్ అరవిందా? విని ఎవరిది తప్పో మీరే నిర్ణయించి చెప్పండి. మీ రెలా చెపితే అలా నడుచుకుంటాను." అతను ఆగి గట్టిగా శ్వాస తీసుకున్నాడు.

"అవి నేను కాలేజీలో చదివే రోజులు" అంటూ కళ్ళు మూసుకుని ఆలోచనలో లీనమై పోయాడు— కథ ఎలా ప్రారంభిస్తే బాగుంటుంది అనే ఉద్దేశంతో కాబోలు.

అతనివైపే చూడసాగింది అరవింద కుతూహలంతో. సూది క్రింద పడినా వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది గదిలో.

(సశేషం)

### చేయూత

వేడుకొను పెదవుల కంటె సాయం చేసే చేతులు గొప్పవి.

—స్వామి రామతీర్థ

### కష్టాలు

దీవెన లెప్పుడూ జంటగా రావు. కష్టా లెప్పుడూ ఒంటిగా రావు

—ఒక చైనీస్ సామెత


ఎన్నాళ్ళెంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి
శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి నవలలు...




సీతాపతి (డిసెంబర్ 14న విడుదల) రూ.12-50
ప్రేమసింహాసనం (జనవరి 16న విడుదల) 15-00




మీ దగ్గరలో వున్న బుక్ షాపులో అడగండి! లేదా-
ఒక పుస్తకం కావలసినా, రెండు పుస్తకాలు కావలసినా 1 రూపాయి
తగ్గించి M.O. చేయండి. ఆరూపాయికి V.P.లో పంపగలం

నవసాహితి బుక్ హౌస్ ఏలూరురోడ్ విజయవాడ-520 002



# నడి ఏటిలో నావ

(క్రిందటి సంచిక తరువాయి)

వేసవి సెలవులు పూర్తి కాగానే పెట్టె,బెడ్డింగు సర్దుకో సాగాడు. మోహన్. అతను వైజాగ్‌లో బి. ఏ. ఫైనలియర్ చదువుతున్నాడిప్పుడు. ఇంటికి వారసుడు ఒక్కడే. పూర్వీకులు సంపాదించిన ఆస్తి చాలానే ఉంది. అతను చదివి, ఉద్యోగం చేయకపోతే గడవదు అనే సంసారం కాదు వాళ్ళది. ఒక్క క్లాసన్నా తప్పకుండా వస్తున్న అతను ఇంకా చదువుకుంటాను అన్నప్పుడు తాతగారు ఏమీ అనలేదు. 'నీ ఇష్టం' అన్నట్లు మవునం అర్ధాంగీకారం అన్నట్లు పూరుకున్నాడు. తల్లే సణిగింది. కొడుకు చదువు పేరుతో ఎక్కడో ఉండడం ఇష్టం లేక—"నువ్వు చదివి ఉద్యోగం చేయాలా పూళ్ళేలాలా? చదివింది చాల్లే. కాంతం మామయ్య కంగారుపడుతున్నాడు సావిత్రిని చేసుకోమని. పెళ్ళి చేసుకుని ఇంటి పట్టున హాయిగా పడి ఉండక, ఎందుకొచ్చిన చదువులు?" అంటూ.

తల్లి మాట వినిపించుకోకుండా పట్నం బయలుదేరాడు మోహన్, తాత అందించిన కరెన్సీనోట్లను జేబులో కుక్కుకుని. కాలేజీలో చేరి, హాస్టల్లో ఉంటూ, డబ్బు కావలసినప్పుడు తాతకు వ్రాసి తెప్పించుకుంటూ, స్టూడెంట్ లైఫ్ జాలీగా ఎంజాయ్ చేస్తూ, కాలక్షేపం చేస్తున్నాడు మోహన్. అలా అని అతను ఆవకతవక పనులు చేయడం కాని, వెర్రి మొర్రి వేషాలు వేయడం కాని కాదు. శ్రద్ధగా చదువుకోవడం, ఫ్రెండ్సుతో సరదాగా సినిమాలకు, షికార్లకు తిరగడం, దిగులు లేకుండా ఖర్చు పెట్టడం—ఇవే అతని అలవాట్లు.

రెండు సంవత్సరాలు పూర్తి అయ్యాయి. మూడవ సంవత్సరంలో అడుగుపెట్టాడు. సెలవులు గడవ తానికి ఇంటికి వచ్చి తిరిగి ఆ రోజే బయలుదేరుతున్నాడు.

ఎవరో సుడిగాలిలా గదిలోకి దూసుకువచ్చారు. ఆ వేగానికి అదిరిపడుతూ తిరిగి చూశాడు మోహన్. కాంతం మామయ్య గారి సావిత్రి నిలుచుని ఉంది గదిలో. ఆమెను చూడగానే అతని ముఖంలో ఎక్కడా లేని ఆనందమూ చోటు చేసుకోగా, అనురాగంగా చూస్తూ, "అక్కడే నిలబడి పోయావేం, సావిత్రీ? వచ్చి ఈ బెడ్డింగ్ కాస్త సర్దిపెట్ట

శుమైతాంగి



Studio Amin/SC

కూడదూ?" అన్నాడు నవ్వుతూ. 'సావిత్రీ, తనూ కాబోయే దంపతులని ఎప్పుడో ముద్ర పడి పోయింది. సావిత్రి త్వరలో తన భార్య కాబో తుంది' అనుకుంటే చాలు మోహన్‌కు ఎంతో సంతో షంగా, పులకింతగా ఉంటుంది. పైకి చెప్పక పోయినా 'ఆ రోజు త్వరగా వస్తే బాగుండును' అని, ఆ రోజు ఎప్పుడెప్పుడా అని ఎంతో తమకంతో ఎదురు చూస్తున్నాడు. 'ఈ చదువు అడ్డం లేక పోతే సావిత్రికీ, తనకూ ఈ పాటికి పెళ్ళి కావడం, ఒకరో, ఇద్దరు పిల్లలు పుట్టడం కూడా జరిగి పోయేది. ప్చ్! ఈ చదువు ఎప్పటికి పూర్తి అవు తుందో? అనే విసుగు ఒక వైపూ, చదువుమీద తృష్ణ ఒక వైపూ అతన్ని వెనక్కూ ముందుకూ లాగుతూంటాయి. నాలుగు రోజులు సెలవు వస్తే చాలు, ఇంటికి పరుగెత్తుకు వస్తాడు. అలా రావ డానికి సావిత్రిని చూడాలనే కాంక్షే కారణం. ఈసారి సావిత్రి తను వచ్చేసరికి ఊళ్ళోలేదు. వాళ్ళ పిన్నమ్మ గారి ఊరు పాలెం వెళ్ళింది. తను రాగానే సావిత్రి వూరెళ్ళిందని తెలిసి చాలా ఆశాభంగం పొందాడు.

రాత్రి కాంతయ్యగారి పాలేరు వచ్చి చెప్పాడు— "సిన్నమ్మగా రొచ్చారయ్యా ఈయేల" అని. ఆ మాట విని ఎగిరి గంతేసినంత పని చేశాడు. అప్పుడే వెళ్ళి సావిత్రిని చూసి పలకరించి రావాలని, కాస్సేపు సరదాగా కాలక్షేపం చేసి రావాలని ఉవ్విళ్ళూరాడు. కాని, అంతరాత్మ హితబోధ చేసింది— 'ఆడపిల్ల ముందు నీ దగ్గరకు రావాలి, నిన్ను పలకరించాలి' కాని నువ్వే వెళతావా? సిగ్గూ, అభిమానం లేవా నీకు? నీవు వచ్చేసరికి తను వూరు వెళ్ళినందుకు నీవు అలక చూపించాలి. ఆమె చేత ప్రబతిమాలించు కోవాలి. తెలిసిందా?' అని. అంతే. ఆమెను చూడా లనే కోర్కెను ఉపసంహరించుకున్నాడు. సావిత్రి ప్రొద్దున్నే వస్తుందేమో తనను చూడటానికి అని ఎంతో ఆశగా ఎదురు చూశాడు. ఎంతసేపు చూసినా సావిత్రి దర్శనమే కాలేదు. ఉండలేక, మనసును నిగ్రహించుకోలేక తనే వెళ్ళాడు కాంతం మామయ్యగారి ఇంటికి.

"అల్లుడూ! మా ఇల్లు ఇన్నాళ్ళకి కనుపించిందా నీకు!" అని కాంతయ్య, ఆయన భార్య మీనా క్షమ్మ నిష్ఠురంగా అంటూంటే మాట్లాడ లేక, మాట్లాడాలంటే తగిన సమాధానం దొరక్క ఒక వెర్రినవ్వు నవ్వేసి వూరుకున్నాడు. అతని చూపులు సావిత్రి కోసం అటూ ఇటూ పరుగెత్తుతూనే ఉన్నవి. ఎంతసేపు కూర్చున్నా, ఆమె కోసం ఎదురు చూసినా సావిత్రి కాని, ఆమె అడుగుల సవ్వడి కాని లేదు.

"సావిత్రి లేదా అత్తా, ఇంట్లో?" ఇక ఉండ బట్టలేక అడిగాడు, తడబడుతూ.

"వూరికి వెళ్ళి రాత్రే వచ్చింది. దాని స్నేహితు రాలు ప్రొద్దున్నే కబురు చేసింది రమ్మని. నువ్వు వచ్చే ముందే వెళ్ళింది. కాస్సేపటికి కూస్సేపటికీ వస్తుంది." మీనాక్షమ్మ కాఫీ గ్లాసు మోహన్‌కు ఇస్తూ అంది. "అలాగా!" అంటూ నీరుకారి పోయాడు. కాస్సేపు పనికిరాని చెత్తంతా మాట్లాడి ఇంటి ముఖం పట్టాడు. మనసులో బాధ, దిగులు, కోపం, కసి సావిత్రి కనుపించనందుకు. ఆ కోపం తోనే పెట్టె, బెడ్డింగ్ సర్దేసుకోసాగాడు. ఇంటికి వచ్చి

'తను బయలుదేరుతూంటే ఈవిడగారు తీరుబడిగా ఇప్పుడు వచ్చిందన్న మాట!' అంతవరకూ ఆమె కనుపించనందుకు కోపంతో ఎన్నో మాటలు అనాలని అంతవరకు మనసులో రిహార్సలు వేసుకున్న అతను ఆమె ఎట్ట ఎదుట కనుపించేసరికి ముందు ఉన్న కోపం అంతా ఏమై పోయిందో కాని, ఏ దేవతో సాక్షాత్కారమిచ్చినట్లు ఆనందంతో ఒళ్ళు ఉప్పొంగగా 'వచ్చావా' అన్నట్లు చూచాడు. ఆ చూపులో ఎన్నో భావాలు, మరెన్నో ప్రశ్నలు ఉన్నాయి.

కాని, సావిత్రి మోహన్ పరిస్థితిని అర్థం చేసుకునే స్థితిలో లేదు. దిగులుగా, ఏదో ఆలోచిస్తున్నట్లు చాలాసేపు పరాకుగా నిలుచుండిపోయింది. సావిత్రిని ఎప్పుడూ అలా చూసి ఎరగని అతను లోలోపల చాలా ఆశ్చర్యపడ్డాడు.

ఆశ్చర్యాన్ని అణుచుకుంటూ, "అలా ఉన్నావేం, సావిత్రీ? ఒంట్లో బాగా లేదా?" అని అడిగాడు ఓదార్పుగా చూస్తూ.

"ఎలా ఉన్నాను? బాగానే ఉన్నానే?" నవ్వడానికి ప్రయత్నించింది సావిత్రి. నవ్వు రాలేదు. ముఖం మరింత పాలిపోయింది.

సావిత్రి తన నుంచి ఏదో దాచడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అనిపించింది.

"ఏమిటి విశేషాలు? వూరినుంచి ఎప్పుడు వచ్చావు?" అడిగాడు ఆమెవైపే చూస్తూ.

"పల్లెటూరిదాన్ని — నా దగ్గరేం విశేషాలు ఉంటాయి? టౌను నుంచి వచ్చావు. ఆ విశేషాలేవో నువ్వే చెప్పాలి కాని!" వెటకారంగా సాగదీసింది సావిత్రి.

"ఇదెప్పటినుంచి?" సావిత్రి ధోరణి వింతగా అనిపించి తికమక పడ్డాడు మోహన్.

"ఏ దెప్పటి నుంచి?"

"అదే— పల్లెటూరి వాళ్ళు, బస్తీ వాళ్ళు అంటున్నావు కదా? ఈ తేడా ఎప్పటినుంచా అని."

ఆ మాటకు సావిత్రి మాట్లాడలేదు. బుంగ మూతి పెట్టి చూడసాగింది. అంతే.

"సెలవులు నాలుగు రోజులు హాయిగా ఎంజాయ్ చేయాలని నీ కోసం వస్తే తమరు మరొక వూరు ఉడాయించారు. నీవు లేక బోరు కొట్టేసిందంటే నమ్ము."

"ఇప్పుడు బయలుదేరావు కదా!"

"నీవు లేవుకదా? ఉండి ఏం చేయను? అందుకే వెళ్ళిపోతున్నాను. నువ్వు ఉండమంటే ఉంటాను." సావిత్రి చేయి పట్టుకుని మృదువుగా అదిమాడు. సావిత్రి మూతి బిగించి, అయిష్టంగా చేయి లాక్కుంది.

"ముందీ మాట చెప్పు, బావా. నువ్వు పెళ్ళి కోసం కంగారు పడుతున్నావా?"

"ఎవరన్నారు?" నవ్వుతూ ఆమె వైపు చూశాడు.

"అత్తే అంటున్నది-'ఈ వేసవిలో పెళ్ళి చేద్దాం". అని."

"మామయ్యే మన్నారు?"

"ఏమంటారు? చెల్లెలి మాట కాదంటారా ఆయన!"

"మరి, నీకు ఇష్టం లేదా మన పెళ్ళి?" అతని ముఖం క్షణంలో వాడిపోయింది.



## డా..డా..డార్లింగ్

ఒక మేనేజరు ఎప్పుడు పిలిచినా అతని లేడీ సెక్రటరీ ఫోనులో ఎవరితోనా మాట్లాడుతూంది అని చెబుతాడు ప్యూన్. ఆయన ఒక రోజున గట్టిగా మందలించాడు.

మేనేజర్: మిస్ కుమారీ! ఎప్పుడు రమ్మన్నా ఫోనులో మాట్లాడుతుంటావ్? ఇదేం బాగలేదు.

లే. సెక్రటరీ: నా స్వంత కాల్స్ కాదు, సార్, ఆఫీసు కాల్స్.

మేనేజరు: అలాగా, ఇక పైన ఆఫీసు పనిమీద ఫోన్ చేసే వాళ్ళను 'డార్లింగ్' అని పిలవకు.

"ఊహూఁ. శారద, రాణి, చంద్రం— అందరూ కాలేజీలో చేరతారట. నేనుకూడా చదువుకుంటాను. ఈ రోజుల్లో ఆడపిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలి, బావా."

"అలా అని ఎవ రన్నారు?"

"మా ఫ్రెండు నాన్నగా రన్నారు. శారదను బి. ఎ. వరకు చదివించి కాని పెళ్ళిచేయరట. రాణి కూడా అంతవరకూ చదువుకుంటుందట."

"అయితే ఇంకేం? నీవూ చదువుకో." ఆ మాటను మనఃస్ఫూర్తిగా అనలేకపోయాడు మోహన్.

"నీవూ చదువుకో — అని చెప్పమనటానికి వచ్చా ననుకున్నావా? నీవు మా నాన్న దగ్గరికి వచ్చి గట్టిగా చెప్పాలి — 'సావిత్రిని కాలేజీలో చేర్పించు, మామయ్యా. అందుకు డబ్బు అవసరమైతే నేను సర్దుతాను. తను బి. ఎ. అయితేనే కాని పెళ్ళి చేసుకోను అని."

"అంతవరకూ పెళ్ళి చేసుకోకుండా ఉండటం చాలా కష్టం, సావిత్రీ. పోనీ, ఒక పని చేయి. ముందు మన పెళ్ళి కానియ్యి. ఆ తరవాత నీతో పరీక్షలకు కూర్చోపెట్టి నీ పేరు చివర డిగ్రీ వచ్చేలా చేస్తాను—సరేనా?"

"వూఁ. చాలా బాగా చదువుతాను—చంకలో ఒక పిల్ల, కడుపులో ఒక పిల్ల, ఏడుస్తూ ఒక పిల్ల వుంటే!" ఆవేశంగా అంది సావిత్రి.

సావిత్రికి పెళ్ళిమీద కంటే చదువు మీదే ఎక్కువ మోజుగా ఉందని గ్రహించాడు మోహన్. "అలాగే. మామయ్యతో చెబుతాను, నిన్ను కాలేజీలో చేర్పించమని. నీ చదువు పూర్తిఅయ్యాకే మన పెళ్ళి. సరేనా?" అన్నాడు తనే రాజీకి వస్తూ.

'సరే' అన్నట్లు తల ఆడించి ఉత్సాహంగా ఎగురుకుంటూ వెళ్ళిపోయింది సావిత్రి.

ప్రయాణం కాన్సెల్ చేసుకుని కాంతయ్య దగ్గరికి వెళ్ళి ఆ మాట, ఈ మాట చెప్పి, తరవాత "సావిత్రిని కాలేజీలో చేర్పించు, మామయ్యా. ఆడపిల్లలకు ఫీజులు ఉండవు" అన్నాడు.

"ఫీజు లేకపోతే నేం? హాస్టల్లో పెట్టి చదివించాలంటే మాటలు కాదోయ్, అల్లుడూ!" అన్నాడాయన అయిష్టంగా.

"హాస్టలు ఖర్చు నేను భరిస్తానులే."

"డబ్బుకేం లే. ఏదో ఒకలా సర్దుబాటు చేసుకోవచ్చు. కాని, ఆడపిల్లను పొరుగు వూరిలో ఉంచడం అంత మంచిది కాదు. ఆడపిల్ల, అరిటాకు సమానమంటారు. అయినా, అది చదివి వూళ్ళేలాలా, ఉద్యోగాలు చేయాలా? ఇంతవరకు చదివింది చాలదూ?" కాంతయ్యకు ఆడపిల్లల చదువు గురించి మంచి అభిప్రాయం లేదు. చదువు పేరుతో ఎక్కడో ఉండటం, అక్కడ వాళ్ళు ఏ వెర్రి వేషాలు వేస్తారో, ఏ చెడ్డపేరు తెస్తారో అని ఆయన భయం. చిన్నప్పటినుంచీ అనుకున్న సంబంధం. త్వరగా ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే తన గుండెమీద ఉన్న బరువు దిగిపోతుందని, ఎంత తొందరగా ఆ క్రతువు పూర్తి అయితే అంత మంచిదని ఎదురు చూస్తున్నా డతను.

అటువంటి సమయంలో 'మా పెళ్ళి ఆపి, నీ కూతుర్ని చదివించు' అంటే, ఆ తరవాత వాళ్ళ మనసు లెలా మారతాయో? అనే సంశయం మరొకవైపు. ముందు పెళ్ళి చేసి ఆ తరవాత చదివిస్తే? కళ్ళముందు పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి 'అవి అప్పుడే తినకండిరా, పిల్లలూ' అంటే వాళ్ళ దృష్టి అటే ఉంటుంది కాని, చదువుమీద ఎందుకు ఉంటుంది?' అనే ఆలోచన. వీటితో ఎటూ తేల్చలేక మవునంగా ఉండిపోయాడతను.

"నా చదువు పూర్తి కావడానికి మరొక ఏడాది గడవాలి. అప్పటివరకూ సావిత్రిని ఖాళీగా ఉంచేకన్నా చదివించడం మంచిది, మామయ్యా. అప్పుడప్పుడు వెళ్ళి నేను చూసి వస్తూంటాను కూడా."

మోహన్ అంత గట్టిగా చెబుతూంటే ఇక అడ్డు చెప్పలేక పోయాడు కాంతయ్య.

"నీ ఇష్టంరా, అబ్బాయ్, నీ పెళ్ళాన్ని చదివించుకుంటానంటే ఏమంటాను? ఆ బాధ్యత అంతా నీవే చూసుకుంటానంటే నా కేలాంటి అభ్యంతరమూ ఉండదు" అన్నాడు అంగీకారం తెలుపుతూ.

కొన్ని రోజులకే సావిత్రి కాలేజీ స్టూడెంటు అయింది. ఆడపిల్లల కాలేజీలో చేర్పించారు. హాస్టల్లో కూడా సీటు దొరికింది ఆమెకు.

"ఇదంతా నీ చలవే, బావా!" అంటూ ఎంతో కృతజ్ఞత చెప్పుకుంది సావిత్రి.

"అంత పెద్ద మాట దేనికి? నీకు చదువుకోవాలని ఉంది, చదువుకుంటున్నావు. నీవుమాత్రం చాలా శ్రద్ధగా, చదువే నీ ధ్యేయంగా చదువుకుంటే నా శ్రమ ఫలించినట్లే" అని తను చదువుకునే వూరు వెళ్ళిపోయాడు మోహన్.

తన కట్టులో, బొట్టులో, ప్రతి కదలికలోనూ ఎంతో మార్పు తెచ్చుకుంది సావిత్రి. "ఇంటికి వస్తావా? ఎప్పుడొస్తావ్? నీ కోసం మా వాళ్ళు, మా అమ్మా కలవరిస్తున్నారు" అంటే — "ఆ వెధవ పల్లెటూరులో ఏం తోస్తుంది? ఒక రోడ్డా, పార్కా, ఒక సినిమాహాలా, ఏమైనా ఉందా? లైబ్రరీ అయినా లేదు. బోరు కొట్టి చావాలి అక్కడికి వస్తే. ఇక్కడైతే టైమే తెలియదు. అలా గడిచిపోతాయి రోజులు" అంటున్నది, తనసలు పల్లెటూర్లో పుట్టి పెరగనట్లే. ఆ వాతావరణం తనకు అసహ్యమనే భావాన్ని వెల్లడిస్తూంటే మోహన్ తెల్లబోయాడు. ఆ తరవాత ఆ అమ్మాయి మాటలకు నవ్వుకున్నాడు చిన్నగా.

"నువ్వు రాలేకపోతే నేనే వస్తాను నీ దగ్గరికి— నిన్ను చూడటానికి. ఏం చేస్తాను మరి!" అతను చిలిపిగా నవ్వుతూ అంటూంటే సావిత్రికి చిరాకనిపించిందేమో— "అస్తమానూ నువ్వు రాకు" అంది ముఖం అదోలా పెట్టి.

"వస్తే ఏం? 'మా కాబోయే శ్రీవారు' అని చెప్పకపోయావా వాళ్ళకు?" మరింత కొంటెగా నవ్వుతూ అంటూంటే, సావిత్రి ఆ మాటకు సిగ్గుపడలేదు సరికదా, ఇష్టంలేని పదార్థం గొంతుక్కు అడ్డం పడినట్లు ముఖాన్ని మరింత వికారంగా పెట్టింది. సావిత్రికి తన రాక కూడా ఇష్టం కావడం లేదన్న మాట — అనుకోగానే అతనికి చాలా బాధ అనిపించింది. ఆ రోజు నువ్వే శరణు అన్న మనిషి ఈ రోజు తన ఉనికి కూడా ఇష్టపడటం లేదు అనుకుంటే, అతనికి గుండె లోతుల్లోంచి దుఃఖం పొంగుకు వచ్చింది. 'సావిత్రీ! నువ్వు నిజంగానే మారిపోయావా? లేక మారినట్లు నటిస్తున్నావా?' అనాలనుకున్నాడు. కాని, అభిమానం అతని గొంతు నొక్కింది. మరి అక్కడ ఆగలేక వెంటనే తిరుగుముఖం పట్టాడు.


'ఈ సారి తన రాకకోసం ఎదురు చూస్తూ ఉండవచ్చు. మునపటిలా తనను నిరాశ పరచదు' అనుకుంటూ ఎంతో ఆశగా సావిత్రిని చూడటానికి వెళ్ళాడు మోహన్, ఇంకొకసారి.

విజిటర్సు రూములో కూర్చుని సావిత్రికోసం కబురు చేశాడు.

"సావిత్రి రూములోనే ఉంది—నేను పిలుచుకు వస్తాను" అంటూ వెళ్ళిన ఒక అమ్మాయి, అంతలోనే ముఖం వేలాడేసుకుని వచ్చి, "సారీ, అండీ! తను లేదు. వార్డెన్‌గారి పెర్మిషన్ తీసుకుని ఎక్కడికో వెళ్ళిందిట" అంది.

"మరే — సావిత్రి ..." అంటూ ఇంకొక అమ్మాయి ఏదో చెప్పబోతూంటే, మొదటి అమ్మాయి ఆ పిల్లను 'చెప్పకు' అన్నట్లు కళ్ళతోనే వారించింది. సావిత్రిని సినిమాకు తీసుకెళ్ళాలని, ఏకాంతంగా ఎక్కడో కూర్చుని తన మనసులోని విరహ వేదన అంతా వ్యక్తం చేయాలని ఎంతో ఆశగా వచ్చిన మోహన్‌కు చాలా ఆశాభంగం కలిగింది.

సావిత్రి తండ్రికి ఒంట్లో బాగాలేదు. 'వెళ్ళి సావిత్రిని తీసుకురండ్రా' అంటూ కూర్చున్నాడు. ఈ వంకతో అయినా సావిత్రిని చూసి రావచ్చని తనే బయలుదేరాడు మోహన్. సావిత్రి హాస్టల్లో




ఉండటం లేదని, మరొక అమ్మాయితో కలిసి రూము తీసుకుని ఉంటున్నదని చెప్పారు, అతను హాస్టల్‌కు వెళితే. సావిత్రి ఉంటున్న రూమ్ నంబరు, అడ్రెస్ కూడా ఇచ్చారు వాళ్ళు. అది తీసుకుని బయలుదేరాడు అతను. వెతుక్కుంటూ ఆ గదికి వెళ్ళాడు. సావిత్రి లేదు, సినిమాకు వెళ్ళిందని చెప్పింది ఆ అమ్మాయి ఫ్రెండు.

వచ్చేవరకు ఉండడమా, లేక చీటీ వ్రాసి పెట్టి వెళ్ళిపోవడమా? ఇంతదూరమూ వచ్చి సావిత్రిని చూడకుండా వెళ్ళడానికి మనసు అంగీకరించలేదు. చూసే వెళ్ళాలి అని తీర్మానించుకున్నాడు.

"చూడండి, అమ్మాయిలూ. నేను వచ్చినట్లు సావిత్రితో చెప్పండి. నేను ఒక ఫ్రెండును కలుసుకుని వస్తాను" అని వాళ్ళ సమాధానం కోసం చూడకుండా రోడ్డు మీదికి వెళ్ళిపోయాడు.

నిజాని కతను ఎక్కడికీ వెళ్ళలేదు. అక్కడే ఆ వీథి చివరిలో ఉన్న కిళ్ళీ కొట్టు దగ్గర కూర్చున్నాడు. ఆరోజు న్యూస్ పేపరు చదువుతూ.

అతనికి కొన్ని గజాల దూరంలో నలుగురు కుర్రవాళ్ళు నిలుచుని సరదా కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్య గొల్లున నవ్వుతున్నారు. వాళ్ళు నవ్వినప్పుడెల్లా పేపరు పటనం మాని తల తిప్పి వాళ్ళ వైపు ఒక క్షణం చూసి, తిరిగి పేపరు చదవడంలో పడుతున్నాడు. అలా ఎంతసేపు గడిచిందో అతనికి తెలియదు. "అదిగోరోయ్! కాలేజీ బ్యూటీ వస్తున్నది. బాగా డబ్బున్న వాడినే పట్టింది. అందుకే మనలాంటి అర్భకులు దాని కంటికి ఆనడం లేదు" అన్నారు ఎవరో గట్టిగా. మోహన్ తిరిగి చూశాడు— 'ఆ కాలేజీ బ్యూటీ ఎవరా?' అనే ఆసక్తితో.

మోపెడ్ మీద దూసుకువచ్చి సావిత్రీ వాళ్ళ ఇంటి గేటు ముందు దిగుతున్నది. ఒక జంట. ఆ అమ్మాయిని సావిత్రిగా గుర్తు పట్టిన మోహన్‌కు కళ్ళముందు చీకటి తెరలు దింపినట్లుంది. కళ్ళు నులుముకుని మళ్ళీ మళ్ళీ చూశాడు. సందేహం లేదు. ఆ అమ్మాయి సావిత్రే! అతనిలో ఒక్కసారిగా ఎన్నో సందేహాలు తల ఎత్తాయి. 'సావిత్రి హాస్టల్ విడిచి పెట్టడానికి, తను వచ్చిన ప్రతిసారీ రూమ్‌లో ఉండకుండా షికార్లు తిరగడానికి ఇదే కారణమన్న మాట. ఇలా ఎంతకాలం నుంచి సాగుతున్నదో? ఇంకెంత కాలం సాగుతుందో? ' సావిత్రి తన కోసమే పుట్టింది అనే భ్రమలో ఉన్నాడు ఇన్నాళ్ళూను. కాని, సావిత్రి తన ఒక్కడి సొత్తే కాదని ఇప్పుడు తెలిసి వస్తున్నది. అందుకే సావిత్రి తనంటే విముఖంగా ఉంటున్నది. చదువు ధ్యాసలో పడి తన మీద నిర్లక్ష్యం చూపిస్తున్నది, అనుకున్నాడు. కాని, ఆ నిర్లక్ష్యానికి కారణం మరొక ఆకర్షణ అన్న మాట. 'ఒరే, మోహన్! నేటి నుంచి సావిత్రి నీ సొత్తు కాదురా! ఆమె మీద ఎలాటి ఆశలూ పెంచుకోవద్దు. గో బాక్! తనను తను నోదార్చుకోసాగాడు. వెళ్ళి సావిత్రితో మాట్లాడాలని, 'అతను ఎవరు? అతనికి, నీకు ఎటువంటి సంబంధం? ఆ రోజు మన పెళ్ళికి చదువు వంకతో అడ్డు పెట్టావు. ఇందుకేనా?' అని కోపంగా నాలుగూ అడిగేయాలనేంత ఉద్రేకంతో వూగిపోయాడు. కాని, ఆ కోపం క్షణమేను. వివేకం హిత బోధ చేయసాగింది :

"నేను నా ఇష్టం వచ్చినట్లు తిరుగుతాను. అడగడానికి నువ్వెవరు?" అంటే ఏం చేస్తావు? "నువ్వంటే నా కిష్టం లేదు. నా మనసుకు వచ్చిన వాడిని నేనే ఎన్నిక చేసుకుంటాను అంటుంది. అప్పుడు నువ్వేం చేయగలవు? ముఖాన్ని వేలాడేసుకుని తిరుగు ముఖం పట్టుతావు — అవునా? అంతకన్న ఏమీ చూడనట్లు వెళ్ళిపో. ఉభయులకూ శ్రేయస్కరం. ఇంటికి వెళ్ళి ఏం చేస్తే ఇదిపరిష్కారం అవుతుందో చూడు."

అంతే. లేచి ఇంటి ముఖం పట్టాడు.

నాలుగురోజుల తరవాత మోహన్ తల్లి సావిత్రి వాళ్ళ ఇంటికి వెళితే సావిత్రి వ్రాసిన ఉత్తరం

పంపించేసారు వాళ్ళు. అది చదివి నీరుకారి పోయిం దామె. "వారు అన్నమాటా మోహన్‌ను పంపిస్తారెందుకు? అతను ఇక్కడికి వచ్చి చాలా అసభ్యంగా ప్రవర్తిస్తుంటాడు. నా ఫ్రెండ్సుని వేళా కోళం చేస్తుంటాడు. అతని మూలంగా హాస్టల్లోంచి బయటికి పంపేశారు. నాకు చాలా సిగ్గుగా బాధగా ఉంది" అంటూ చాలా ఘాటుగా వ్రాసింది. అది చదివి, "దీనిలో నిజం ఎంత ఉందో కను క్కుంటాను" అంటూ ఆ ఉత్తరం తీసుకుని వచ్చి కొడుక్కు చూపెట్టి, "ఏమంటావురా?" అని నిలే సిందామె. అది చదివి తెల్లబోయాడు మోహన్. సావిత్రి చాలా తెలివైనది. తను ఇక్కడికి వచ్చి అందరితో ఏదో చెప్పుతాడని ముందే వూహించుకుని ఇలా వ్రాసిందన్న మాట. కొడుకు కాని, కూతురు కాని ఎంత చెడ్డవారైనా తల్లిదండ్రులు గ్రహించ లేరు సరికదా, తమ పిల్లలే ఎంతో బుద్ధిమంతులని సక్రమ ప్రవర్తన కలవారని వూహించి మురిసి పోతుంటారు.

సావిత్రి గురించి ఏం చెప్పినా లాభం లేదని, వాళ్ళు నమ్మలేరని గ్రహించిన మోహన్, తల్లికి మాత్రం తను చూసింది, విన్నది చెప్పాడు.

"ఆసి భడవ! ఎంత ప్లాను వేసింది నీ మీద!" అని నొచ్చుకుని, "అసలు సావిత్రిని నీకు చేస్తారో, లేదో కనుక్కుని వస్తాను" అంటూ అప్పుడే వెళ్ళింది అక్కడికి. ఆవిడ పెళ్ళి మాట ఎత్తేసరికి అందరూ అప్రసన్నులై పోయారు.

"అప్పుడే ఏం కంగారు? దాని చదువు పూర్తి కావాలి కదా? మధ్యలో ఎలా ఆపుజేస్తాము?" అన్నారు వాళ్ళు నిర్లక్ష్యంగానే.

"ఆడపిల్ల చదివి వూళ్ళేలాలా? ఉద్యోగాలు చేయాలా? చదివింది చాలు, పెళ్ళి చేపేస్తే మీ బాధ్యత తీరిపోతుంది కదా?" అందామె.

"అదింకా చదువుకుంటాను అంటున్నది. అదీ కాక మధ్యలో ఆపించడం మాకూ ఇష్టం లేదు. అంత తొందరగా ఉంటే మీ అబ్బాయికి మరొక సంబంధం చూసుకోవమ్మా."

వాళ్ళు అంత నిర్లక్ష్యంగా సమాధానమిస్తారని వూహించని ఆమె నిర్విణ్ణురాలయింది. పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనుపించి నట్లు, కూతురు మాటల మీద బలీయమైన నమ్మకాన్ని పెంచుకున్న వాళ్ళు తనిప్పుడు ఏం చెప్పినా నమ్మే స్థితిలో లేరని అర్థం చేసుకుంది.

"సరే, నా కొడుక్కు పిల్ల దొరకనప్పుడు చూద్దాంలే" అని విసవిస వడుస్తూ ఇంటికి వచ్చే సింది.

తల్లి మొహం చూసి అక్కడ జరిగింది వూహించుకోగలిగాడు మోహన్. ఇక తల్లి నేమీ రెట్టించలేదు.

ఆ మరునాడు అతను నిద్ర మంచం మీంచి లేచి ఇవతలికి వస్తూంటే నడవలో తల్లి ఇంటి పురోహి తుడుతో ఏదో చెప్పడం కనుపించి చెవు లొటే రిక్కించాడు.

"భీమవరంలో ఒక సంబంధం ఉందన్నారుగా? వెళ్ళి మీరు చూసి రండి. తరవాత అబ్బాయిని పంపించవచ్చు. వాడికీ నచ్చితే ఇక ముహూర్తాలు పెట్టుకోవచ్చు" అంటున్నది తల్లి. "అలాగే వెళతా నమ్మా" అన్నాడు పురోహితుడు లేస్తూ.

అతన్ని వెళ్ళనిచ్చి, "నేను నీ ఎదురుగా ఉండాలని నీకు లేదా, అమ్మా?" అన్నాడు తల్లి వైపు సూటిగా చూస్తూ.

"అదేమిటిరా!" కొడుకు అంతర్యం తెలుసుకో లేక తికమక పడిందామె.

"అదంతే. విడమరిచి చెప్పే ఓపిక నాకు లేదు. కాని, నేను ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోను. నువ్వు బలవంతంగా జరిపించేటట్లయితే ఈ ఇంట్లో నుంచి వెళ్ళిపోతాను. తరవాత నువ్వు బాధ పడినా, పశ్చాత్తాప పడినా లాభం ఉండదు." అక్కడినుంచి విసురుగా వెళ్ళిపోయాడు మోహన్, తల్లి ఆలోచించుకోవడానికి వ్యవధి ఇస్తూ.

కొడుకు అని పోయిన మాటకు ఆమె గుండెలో రైళ్ళు పరుగెత్తినట్లు అయి నిలువు గుడ్లు పడి పోయాయి.

'కొడుకు ఆ పిల్లను అంతగా ఇష్ట పడుతున్నాడా! దాన్ని మరిచి పోలేకే అప్పుడే పెళ్ళి వద్దంటున్నాడేమో? అయినా, అప్పుడే తొందరపడటం ఎందుకులే? వాడి మనసు కుదురుపడ్డాకే పెళ్ళి ప్రయత్నం చేయ వచ్చు. ఆడ పిల్ల కాదుగా వయసు మించి పోతున్నది అని భయపడడానికి?' అనే సమాధానాలతో మనసు లోని ఆరాటాన్ని తగ్గించుకుంది. కాని, మోహన్ మనసు మాత్రం కోపంతో, ద్వేషంతో, అవమానంతో ఉడికి పోతున్నది. 'తను ఇందుకు ప్రతిఫలంగా సావిత్రికి శాస్తి చేయాలి. అప్పుడు కాని తన కసి చల్లారదు. ఏం చేస్తే సావిత్రికి బుద్ధి వస్తుంది? ఆమెను ఏ రకంగా సాధించి పగ తీర్చుకోవాలి?' రాత్రి, పగలు ఇదే ఆలోచన. కంటికి నిద్ర, కడుపుకి తిండి దూరమైనాయి. కళ్ళలో కోపం బుసలు కొట్టుతూంటే, పగపట్టిన త్రాచు తన కోపం, కసి తీరకపోతే ఎలా కొట్టుకుంటుందో అలా కొట్టు మిట్టాడుతున్నది.

"అదేమిట్రా, బాబూ, దాని గురించి బెంగ పెట్టుకుని నా కడుపులో చిచ్చుపెడతావా? నీ కేం— మగవాడివి. ఆడదానికి మొగుడు ఒక్కడే. కాని, మగవాడికి పది మంది పెళ్ళాల నైనా చేసుకునే హక్కు ఉందిరా. నీ కేం లోటు? నువ్వు వూఁ అను. దానికన్న రెట్టింపు అందంగా ఉన్న అమ్మాయిని చేస్తాను. నాకు ఉన్నది నీవు ఒక్కడివేను. నిన్ను కళ్ళలో పెట్టుకుని పెంచానురా. ఆ దౌర్భాగ్యురాలి గురించి నువ్వు పిచ్చివాడివి కావద్దురా." తల్లి నయాన, భయాన కొడుక్కు బోధిస్తూనే ఉంది. దారికి తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

* * * *

"సావిత్రి పెళ్ళి చేసుకుందట. వాళ్ళ కాలేజీలో పని చేసే మాస్టారినే చేసుకుందట. అతనికి చాలా ఆస్తి పాస్తులు ఉన్నాయట. ఇవ్వాళో రేపో దంపతులు ఇద్దరూ వస్తున్నారట" అనే వార్తలు వూరంతా వ్యాపించాయి.

"ఆడపిల్లలు మరీ బరి తెగిస్తున్నారమ్మా!! చదువు లంటూ పొరుగూళ్ళో మకాం పెట్టడం, కంటికి నచ్చిన వాడిని ప్రేమించడం, వెంటనే పెళ్ళి చేసుకోవడమూను. అవ్వ! ఆ పిల్లకు బుద్ధి లేకపోతే వాళ్ళ పెద్దలకైనా ఉండక్కర్లేదా?"

"అతను సాటి కులస్థుడో, కాదో? ఈడూ జోడూ కలిసిందో, లేదో? ఏదీ చూసుకో కుండానే పెళ్ళా!" అని అమ్మ లక్కలు బాహాటంగానే చెవులు కొరుక్కుంటున్నారు.

సావిత్రి వాళ్ళ ఇంటి దగ్గర హడావిడిగా ఉందని చాకలి రామి చెప్పగా విన్న మోహన్ తల్లి నిట్టూ ర్చింది. 'ఆ పిల్ల గురించి నిక్షేపంగా ఉండే నా కొడుకు నాశనమై పోతున్నాడే?' అన్నదే ఆమె బాధ.

రెండు రోజుల తరవాత చిన్న కారులో భర్తతో సహా వచ్చింది సావిత్రి. వూరంతా ఆ ఇంటి ముందే ఉంది—'సావిత్రి ఏరి, కోరి చేసుకున్న ఆ భర్త ఎంతటి అందగాడో' చూదా లన్న కుతూహలంతో.

సావిత్రి మొగుడు అని ముద్ర పడిన ఆ అపురూప వ్యక్తి నల్లగా, పొట్టిగా, కాస్త లావుగా, అప్పు డప్పుడే బట్టతలగా రూపు దిద్దుకుంటున్న పలచటి క్రాపుతో ఉన్నాడు. అతన్ని చూసి చాలామంది— 'ప్చ్! ఇతన్నా సావిత్రి చేసుకున్నది? ఇతనిలో ఏం చూసి చేసుకుందో ఆ పిల్ల? అతని వెనకాల ఉన్న ఆస్తి పాస్తులు చూసో, వేళ్ళకు ఉన్న రవ్వల ఉంగరాలు చూసో మనసు పారేసుకుని ఉంటుంది. ఇచ్చిన మనసు వెనక్కు తీసుకోలేక పెళ్ళి చేసుకుని ఉంటుంది బహుశా. కాని, ఆ పిల్లకు తగిన మొగుడు కాదు' అని నిర్ధారణకు వచ్చేశారు చాలామంది. కొందరైతే చిలవలు పలవలు కల్పించి మోహన్ తల్లికి చెప్పారు కూడాను.



## ఛాన్సు

ఒకాయనకు భార్య చనిపోయింది. ఒక్కటే కూతురు. చాలా అందంగా ఉంటుంది. ఒక రోజున తండ్రి కూతుర్ని పిలిచి బుజ్జగించి— "అమ్మా! నీ కో రహస్యం చెబుతాను. నీకు మైనారిటీ తీరే వరకు ఆ విషయం నీకు చెప్ప కూడదని ఆగాను" అన్నాడు.

"ఏమిటి, డాడీ, అంత పెద్ద రహస్యం?" అంది ఆ అమ్మాయి.

"మీ అమ్మను నేను పెళ్ళిచేసుకోలేదు తల్లీ" అన్నాడు.

"థాంక్స్, డాడీ! నేను ఈ రోజే బయలుదేరి మద్రాసు పోతున్నాను".

"ఎందుకు?"

"సినిమాలో హీరోయిన్ చాన్సు కోసం" అంది.




లేబిల్ చింపేయండి
ఇంట్లోపెట్టిన ఊరగాయ
అనే అనుకుంటారు.

కాను మరి ఎందుకనుకోరు? ఇంట్లో పెట్టుకున్న ఊరగాయలకుండే సహజ సువాసన, రుచి జయ ఊరగాయలకే ఉన్నాయి. కారణం ఏమిటో తెలుసా? జయఊరగాయలు మాత్రమే సాంప్రదాయంగా ఇంట్లో పెట్టు కున్నట్టు చేతితోనే తయారు చేయబడ్డాయి. ఇందులో రెండు రకాల కారప్పొడి కలసి వుంది. ఒక పొడి రంగునిస్తే మరో పొడి ఘాటైన రుచి నిస్తుంది. అంతేగాక ఇతర దినుసులు కూడా సరియైన పాళ్ళలో నైపుణ్యము, అనురాగము మేళవించి కలిపేరు.

అందరికీ వచ్చే జయ - అందరూ మెచ్చే ధర 500 గ్రాముల మామిడికాయ పచ్చడి సీసా రు. 9-75* మాత్రమే. 1 కిలో పెద్ద సీసా రు. 14-75*. ఆదాకు అసలు పేరు జయ. ఆవకాయ, నిమ్మకాయ, వెల్లుల్లి, పచ్చిమిరప, కొబ్బరి, కలగలుపు కూరగాయలు, మామిడి క్రొత్త రకాలకు పెట్టింది పేరు జయ!

jaya
PICKLES
జయ ఊరగాయలు



తొలిఘలప్పు ఎంత రసవత్తరంగా ఉంటుందో అంత రమ్యంగా ఉంటుంది జయ

* అమలులోవున్న ప్రకారము స్థానిక, పన్నులు అదనము.

ASSOCIATED/224-9

తయారు చేసినవారు :
సంజూస్ నైస్ ఫుడ్స్ అండ్ గుడ్స్ (ఇండియా)
1-10-72/6, బేగంపేట మెయిన్‌రోడు, హైదరాబాద్-500 016.

"అతనేం బాగాఉండడు. అతను నీకొడుకు కాలి గోరుకుకూడా సరిపోడు" అని తేల్చేశారు.

"అహా అలాగా?" అని మనసులో తృప్తిగా నవ్వుకుందామె. అటువంటి చపల చిత్తురాలు తన కోడలు కానందుకు అమితంగా ఆనందించింది కూడాను.

* *

మోహన్‌రావు మనసులోంచి సావిత్రి పూర్తిగా తప్పుకుందిప్పుడు. అతను ఉద్యోగంలో చేరాడు. డిపార్టుమెంటల్ పరీక్ష లన్నీ కట్టి పాసయ్యాడు. ఒక్కొక్క మెట్టే పైకి ఎక్కుతూ, చివరికి ఆఫీసరు రాంకులోకి వచ్చాడు. ఆఫీసు రూల్సు పాటించడంలో ఎంత స్ట్రిక్టో, ఆడవారి విషయంలో అంత లూజు కారెక్టర్ తెచ్చుకున్నాడు.

ఆఫీసరు పొజిషన్‌లో ఉన్న అతని దగ్గరికి ఆడవాళ్ళు కోరకుండానే వచ్చేవారు. అతని కోరిక తీర్చి, తమ పని జరిపించుకునేవారు. కొందరు డబ్బు ఎర చూపిస్తే లొంగిపోయేవారు. మరి కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో బానిస లయ్యేవారు.

అతని అందం, వాక్చాతుర్యం ఆడవారిని సమ్మోహపరిచేవి. ఆ రకంగా కొందరు అతనికి చేరువ అయ్యారు.

ఎంత అందం, సౌకుమార్యం, లాలిత్యం ఉన్న ఆడవారినైనా అతను నలిగి, వాడిపోయిన పువ్వును బయట పారేసినట్లు విడిచి పెట్టేసేవాడు. ఒకసారి ఆఘ్రాణించగానే ఆ పువ్వుమీద అతనికి మోజు తీరిపోయేది. తుమ్మెద మకరందం కోసం ఎన్నో పూలమీద వాలుతుంది. తనకు కావలసిన మకరందం లభించగానే మరో పువ్వును వెతుక్కుంటూ వెళ్ళిపోతుంది. మోహన్‌రావు మనస్తత్వమూ అటువంటిదే. అతని దృష్టిలో పడిన ఆడది తప్పించుకోలేదు. ఎంతమంది అమ్మాయిలో అతని కోర్కెకు బలి అయిపోయారు.

అతన్ని ఆ వూరుకు మార్చారు. అతని దృష్టి ఆఫీసులో ఒక అమ్మాయి మీద పడింది. ఆ అమ్మాయి చాలా మితభాషిణి. ఎవరితోనూ అనవసరంగా మాట్లాడదు. ఎంతవరకు అవసరమో అంతవరకే మాట్లాడుతుంది. తన పనేమిటో తనేమిటో అంతే. టైముకు రావడం, తనకు కేటాయించిన పని చేసుకోవడం, నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోవడం. బహుశా ఇందుకే ఆమె అతన్ని బాగా ఆకర్షించుకుంది. 'ఎలాగైనా ఆమెను లోబరుచుకోవాలి; లేదా బలాత్కారంగానైనా పెళ్ళి చేసుకోవాలి.' ఈ నిర్ణయానికి వచ్చాడు.

అప్పటినుంచి ఆమెను లొంగదీసుకోవడానికి పథకాలు వేయసాగాడు.

సాధారణంగా ఆఫీసరు కొడుకులకు, కూతుళ్ళకు బర్త్‌డే పార్టీలు చేయడం సర్వ సామాన్యం. అటువంటి పార్టీలకు తప్పనిసరిగా వెళ్ళడం ఆఫీసు స్టాఫ్ కర్తవ్యం.

అతనికి అందమైన భార్య ఉంది. ఆ భార్యకు పుట్టిన రోజు పండుగ చేస్తున్నారు. అదీ చాలా సింపుల్‌గా. ఆఫీసు స్టాఫ్‌ను పిలవకుండా కేవలం ఆమెకే ఆహ్వానం వెళ్ళింది.

ఆఫీసరు స్వయంగా వచ్చి పిలుస్తూంటే ఆమె

వెళ్ళకుండా ఎలా ఉంటుంది? అందంగా ఉన్న ఆఫీసరు భార్య ఇంకెంత అందంగా ఉంటుందో! అందమైన దంపతుల ప్రేమఫలం ఇంకెంత అందంగా ఉంటాడో! వాళ్ళను చూడాలనే కుతూహలంతో ఆఫీసరుగారి ఆహ్వానాన్ని తిరస్కరించకుండా బయలుదేరింది.

అతనికి పెళ్ళి కాలేదని, పెళ్ళే కానప్పుడు భార్య ఎలా ఉంటుంది' అనే ప్రశ్నలు ఆమెకు కలిగితే? తనను రాంగ దీసుకోవడానికే ఆఫీసరు వేసిన కొత్త ప్లానని ఆమె గ్రహించి ఉంటే? ఈ కథకు మరొక మలుపు ఉండదేమో?'

* * * *

అంతవరకు ఒక కథలా వినిపించిన తన గతాన్ని అక్కడితో ఆపుతూ అతను కళ్ళు మూసుకున్నాడు.

"ఆడవాళ్ళు మొదట అయిష్టాన్ని ప్రదర్శిస్తారు. ఔట్బు చూపిస్తారు. తరవాత తపాళ్ళే రాంగి పోతారు అనుకున్నాను కాని, నా అంచనా తప్పింది. మంచి గుణపాటం నేర్పావు నీవు. సారీ. నేర్పారు" నుదుటి మీద గాయాన్ని చేత్తో తడుముకుంటూ అన్నా డతను. అతని గొంతులో జరిగిన దానికి పశ్చాత్తాప పడుతున్నట్లు ధ్వనించింది.

"అందరాడవాళ్ళూ మీ సావిత్రి లాంటి వాళ్ళు కాదు, సార్." అతని వైపు సానుభూతిగా చూస్తూ నెమ్మదిగా అంది అరవింద.


"వాళ్ళకూ మానాభిమానాలుఉంటాయి. ప్రేమించే మంచి హృదయం ఉంటుంది. కాని, మీ మగ వారిలో మాత్రం నమ్మకద్రోహం చేసే వారు లేరా? నమ్మించి దగా చేసే వాళ్ళూ, డబ్బును ప్రేమించి, మోసం చేసేవారూ మీ జాతిలోనూ ఉన్నారు. అందుకు నిదర్శనం శశికాంతేను. అతని గురించి చెపితే మీ రేమంటారు?

'నువ్వూ నా లాగే మగవాళ్ళను వంచిస్తూ, ప్రేమించినట్లు నటిస్తూ దగా చెయ్యి' అంటారు కాబోలు." మందహాసం చేసిందామె.

"శశికాంతా?! అత నెవరు? మీ బావా?" అతని గొంతులో కుతూహలం, కొద్దిగా అసూయకూడా తొంగి చూడకపోలేదు.

"స్వంత బావ కాకపోయినా, వాళ్ళ నాన్నను 'మామయ్యా' అని పిలిచేదాన్ని. వాళ్ళ అమ్మను 'అత్తయ్యా' అని పిలిచేదాన్ని. మా ఇద్దరికీ పెళ్ళి చేయాలని మా పెద్దలు ఎప్పుడో నిర్ణయించారు. అతను చనువు తీసుకోబోతే నేనే దూరంగా ఉండేదాన్ని. భర్త అయ్యే వరకూ మగవాడి దగ్గర కాస్త రిజర్వ్డు గానే ఉండాలన్నది నా తత్త్వం. 'ఈ వేళ కాకపోతే రేపైనా అతనితో తిరగవా? ఎలాగూ మీకు పెళ్ళి చేయాలనుకుంటున్నాము కదా?అతని వెంట సినిమాకు వెళ్ళమ్మా' అనే వాళ్ళు అమ్మా, అత్తయ్యాను. కాని, నాకే వెళ్ళ బుద్ధి వేసేది కాదు. ఏమో—సమయమూ, సందర్భమూ కలిసి జరగరాని దేదైనా జరిగితే? అప్పుడు ప్రోత్సహించే ఈ పెద్దలే 'ఎందుకు తొందర పడ్డారు?' అని మందలించవచ్చు. అందుకే ఎప్పుడూ నన్ను నేను అదుపులో ఉంచుకునేదాన్ని.

శశికాంత్ చదువు ఇంకా పూర్తి కాలేదు. తను ఎమ్. ఏ. చదువుతున్నాడు. అప్పుడప్పుడు అతని వెంట ఒక అమ్మాయి వస్తూ ఉండేది.




ఆ అమ్మాయి తన క్లాస్‌మేటని చెప్పేవాడు. ఆ అమ్మాయిలో అందం ఎలా ఉన్నా, ఆకర్షణీయంగా ఉండేది.

మా కజిన్ ఒకరు 'వాళ్ళిద్దరూ చాలా క్లోజుగా ఉంటారు?' అనేవాడు. 'బహుశా ఆమె శశి గర్ల్ ఫ్రెండు కావచ్చు. పెళ్ళయినా శశికాంత్ అమ్మాయిలతో స్నేహం చేస్తే నువ్వు వూరుకోగలవా?' అని అడిగేవాడు నవ్వుతూ. ఆ మాటకు మనసులో ఉలికిపడినా, ఆ భావాన్ని పైకి రానివ్వకుండా— 'పెళ్ళయ్యాక మాట కదా? అప్పుడు చూద్దాంలే, అన్నయ్యా' అనేదాన్ని.

ఆ తరవాత నాకు జ్వరం వచ్చింది. అది టైఫాయిడ్‌లోకి దించి మృత్యువుకి దగ్గరగా తీసుకు వెళ్ళి అప్పుడు తగ్గింది. నేను కోలుకోవడానికి చాలా రోజులు పట్టింది. పొడవుగా ఉన్న జుట్టు రాలి పోయింది. నల్లగా, ఒత్తుగా, రింగులు తిరుగుతూ తిరిగి పెరగ సాగింది. కొత్త రక్తం పట్టిన బుగ్గలు నిండుగా నిగనిగలాడుతూ ఉండేవి.

* * * *

ఒక రోజు శశికాంత్ మా ఇంటికి వచ్చి, నన్ను పలకరించి తరవాత నాన్నగారితో చాలా సేపు మాట్లాడి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయాక నాన్నగారి ముఖం వాడిపోయి ఉండటం గమనించాను. అమ్మా, నాన్నా గదిలో కూర్చుని దేని గురించో తీవ్రంగా వాదించుకోసాగారు.

"మన పిల్లకేం లోటు వచ్చింది? ఇన్నాళ్ళూ ఉన్న అందం ఇప్పుడు తగ్గిపోయిందా? మొదటి నుంచీ ఆశ పెట్టి ఇప్పుడు అర్థాంతరంగా అన్యాయం చేస్తాడా? అతనికి బుద్ధి లేకపోతే వాళ్ళ పెద్దవాళ్ళకైనా ఉండక్కర్లేదా?' అని అరుస్తున్నది అమ్మ.

"అబ్బబ్బ! అలా అరవకే. అది వింటుంది. అసలే జబ్బు పడి లేచింది" అని వారిస్తున్నారు నాన్న. 'నా విషయం గురించే కాబోలు' అనుకుని తలుపు దగ్గరికి వెళ్ళి నిలుచున్నాను, వాళ్ళకు కనుపించకుండా.

"అతను "ఇష్టం లేదు, చేసుకోను" అంటూంటే మీద వేసి కట్టమంటావా? నే నంత వెధవని కాను బలవంతపు పెళ్ళి జరిపించడానికి. మన పిల్ల అనాకారి కాదు. కట్నం ఇవ్వలేని వాణ్ణి కాదు. మనకు తగ్గ సంబంధం మనకు వస్తుంది. వాడి ముఖం మీద కొట్టినట్టు వాడి పెళ్ళికి ముందే మన అమ్మాయి పెళ్ళి జరిపిస్తాను—చూడు." ఇవి నాన్నగారి పట్టుదలతో కూడిన మాటలు.

'వూ చేస్తారు—"మొదట కుదిరిన సంబంధం ఎందుకు చెడిపోయింది?" అని ఆరాలు తీయకపోతే వచ్చిన వారు అమ్మాయి పెళ్ళి మాట దేవు డెరుగు!' అమ్మ భయం అమ్మది. కూతురు పెళ్ళి చెడిపోయింది అంటే, ఎందుకు చెడింది? ఏ కారణాన చెడిపోయింది? లోపం ఎవరిది?' అనే ప్రశ్నలు అందరిలో తల ఎత్తుతాయని, అందరికీ నా పెళ్ళి ఒక క్వెశ్చన్ మార్కు అయిపోతుందేమోనని అమ్మ భయసందేహాలు.

ఒక రోజు నాన్నగారు నన్ను పిలిచి, 'చదువు కుంటావా? కాలేజీలో చేర్పిస్తాను' అన్నారు. రెండేళ్ళ తరవాత తిరిగి కాలేజీకి వెళ్ళాలంటే సిగ్గుగా ఉంది. అయినా, ఆయన తృప్తి కోసం 'అలాగే చదువు కుంటాను' అని చెప్పాను. చేతిలో పుస్తకాలు, టిఫిన్ బాక్సుతో కాలేజీ జీవితం మళ్ళీ ప్రారంభమయింది. నేను చదువుకుంటూంటే మా ఇరుగు పొరుగు వారిలో అనేక సందేహాలు ఉత్పన్నం కాసాగాయి.

'ఇన్నాళ్ళూ మానిపించి ఇప్పుడు మళ్ళీ పంపిస్తున్నారేం?'

'వీరభద్రంగారి అబ్బాయికి చేస్తానన్నారు కదా మీ అమ్మాయిని?'

'వాళ్ళ అబ్బాయి చేసుకోనన్నాడా?'

'అయినా, ఈ రోజుల్లో చదువుకున్న అబ్బాయిలు పెద్దవాళ్ళ మాట వింటారా వాళ్ళ పిచ్చి గాని!' ఇలా రకరకాల ప్రశ్నలతో అమ్మను వేధిస్తూండే వారు.

వాళ్ళకు ఏం సమాధానం చెప్పాలో అమ్మకు తోచేది కాదు. వాళ్ళ వైపు నిస్సహాయంగా, అయోమయంగా చూసేది; లేదా వినిపించుకోనట్లు నటించేది.

'శశికాంత్ పెళ్ళట. అతని వెంట తిరిగే అమ్మాయితోనే అతని పెళ్ళి నిశ్చయమయింది.'

కొడుకు పెళ్ళికి రమ్మని పిలవడానికి వచ్చారు వీరభద్రంగారు. అతన్ని చూసి అమ్మ లోపలికి వెళ్ళి పోయింది, ముఖం తిప్పుకుని.

నాన్నగారు ముఖాన్ని కందగడ్డలా చేసుకుని, "ఏ ముఖం పెట్టుకుని వచ్చావయ్యా పిలవడానికి?' అన్నట్లు ఈసడింపుగా చూశారు.

'కట్నం తక్కువైనా ఈ పెళ్ళికి ఒప్పుకోక తప్పలేదోయ్, బావా. పిల్లకూడా అబ్బాయితో సమానంగా చదివింది కదా? ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ వెనకేసుకుంటారులే అని ఒప్పుకున్నాను' అని 'నువ్వుకూడా రావాలమ్మాయ్ పెళ్ళికి' అని నాతో చెప్పి వెళ్ళిపోయారు.

'సిగ్గులేని మనిషి. వాడి కొడుకు పెళ్ళికి వెళ్ళాలట. పైగా ఎలా చెపుతున్నాడో—"ఇద్దరూ చదువుకున్నారు, ఉద్యోగాలు చేసుకుంటారు" అని. నాన్నగారు కాండ్రించి తుపుక్కున వూసి లోపలికి వెళ్ళిపోయారు.

శశికాంత్ పెళ్ళి చేసుకున్నందుకు నాకు బాధగానూ లేదు, కోపంగానూ లేదు. 'మా ఇద్దరికీ రాసి పెట్టి లేదు. అంతే' అనుకున్నాను.

సెకండ్ ఇయర్‌లో ఉండగా అమ్మా, నాన్నా

---

# రైతులకు రాయితీలు

# రుణాలు చెల్లింపు కాల వ్యవధి పొడిగింపు

వ్యవసాయదార్ల సాధక బాధకాలను తొలగించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 1980 జూన్ 30వ తేదీ నాటికి వివిధ సహకార ఆర్థిక సంస్థలకు రైతులు బకాయిపడ్డ రుణాల వసూళ్ళ విషయంలో కాల వ్యవధిని పునర్నిర్ణయించింది.

**అసలు మొత్తం :**

| | |
|---|---|
| సాధారణ రుణం<br>మధ్యకాలిక (మార్పు చేసిన)<br>రుణ వాయిదా | మూడు సంవత్సరాల రుణంగా పునర్నియామం<br>సాధారణ రుణంతో కలుపుకొని రుణ మొత్తం<br>ఐదు సంవత్సరాల రుణంగా పరిగణింపు |
| మధ్యకాలిక (పునర్నిర్ణాయక)<br>రుణ వాయిదా | మధ్యకాలిక సాధారణ రుణంతోపాటుగా మొత్తం (మార్పు చేసిన)<br>రుణాలన్నీ ఏడు సంవత్సరాల వ్యవధి రుణాలుగా పరిగణింపు |

**వడ్డీ :**

ఒక సంవత్సరానికి వడ్డీ బకాయి : ఒక సంవత్సరంపాటు వాయిదా వేశారు

రెండు సంవత్సరాల వడ్డీ బకాయి : రెండు సంవత్సరాలు గడువు పెంచారు

మూడు సంవత్సరాలు, అంతకు మించిన కాలానికి వడ్డీ బకాయి : మూడు సంవత్సరాలపాటు వ్యవధి పెంచారు.

**దీర్ఘకాలిక రుణాలు :**

మొత్తం మీద గడువు పొడిగింపు మూడు సంవత్సరాలకు మించకుండా దీర్ఘకాలిక రుణాలను రుణం కాల వ్యవధితో పాటుగా, బకాయిపడ వాయిదాల సంఖ్య మేరకు, తిరిగి చెల్లించడానికి ఈ దిగువ విధంగా గడువు పెంచారు.

ఒక వాయిదా బకాయి బడ్డట్టయితే, ఒక సంవత్సరంపాటు గడువు పొడిగింపు :

ఒక వాయిదా కంటే ఎక్కువగా మూడు వాయిదాలకు మించకుండా బకాయిపడ్డ పక్షంలో రెండు సంవత్సరాల పాటు గడువు పొడిగింపు :

మూడు వాయిదాలకు మించి బకాయి పడ్డప్పుడు, కాల వ్యవధి మూడు సంవత్సరాలకు పెంచారు.

**చక్రవడ్డీ లేదు :**

చక్రవడ్డీ వసూలు చేయరాదని సహకార సంస్థ లన్నింటికీ ఉత్తర్వు లిచ్చారు.

సన్నకారు రైతులు చెల్లించాల్సిన మొత్తం వడ్డీ అసలుకు మించరాదు.

**స్వాధీన భూములు :**

సహకార బ్యాంకులు స్వాధీనం చేసుకున్న భూములింకా వాటి ఆధ్వర్యంలోనే ఉన్నట్లయితే, రుణ గ్రహీతలు పైన తెలిపిన రాయితీలకు లోబడి వారివారి బకాయిలు 1980 డిసెంబరు 31వ తేదీలోగా చెల్లించి వేయడానికి అనుమతించబడ్డారు.

**సన్నకారు రైతుల పథకం :**

సన్నకారు రైతుల ప్రస్తుత పునర్నిర్వచనాన్ని అనుసరించి, ఐదు ఎకరాల మాగాణి భూమి, లేదా పది ఎకరాల మెట్ట భూమిగాని, అంతకు తక్కువ భూమిగాని కలిగివున్న సన్నకారు రైతులకు పై ప్రయోజనాల నన్నింటినీ కల్పించాల్సిదిగా కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

---

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

